www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
గురువారం
08-08-2024
సంపుటి : 01 | సంచిక : 96 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




## రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం

ప్రపంచబ్యాంకు సంసిద్ధత

స్కిల్ డెవలప్‌మెంట్, నెట్ జీరో, ఫ్యూచర్ సిటీ, సిటిజన్ హెల్త్ ప్రాజెక్టులపై ఆసక్తి

ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో ముఖ్యమంత్రి రేవంత్ బృందం భేటీ



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికల్లో భాగస్వామ్యం పంచుకునేందుకు ప్రపంచ బ్యాంక్ సంసిద్ధతను వ్యక్తం చేసింది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగాతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వివిధ అంశాలపై దాదాపు గంటసేపు చర్చలు జరిపారు. రాష్ట్రంలో చేపట్టే వివిధ ప్రాజెక్టులకు కలిసికట్టుగా మిగతా2లో...

## రూ.400 కోట్లతో వివింట్ ఫార్మా విస్తరణ
2



## చెదిరిన భారత్ కలలు

ఒలింపిక్స్‌లో భారత కల చెదిరింది. పతకం కోసం ఆశగా ఎదురుచూసిన యావత్ దేశ ప్రజలకు నిరాశ కలిగింది. ఫైనల్ చేరిన రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు పడింది. 50 కేజీల విభాగంలో వినేశ్ ఫోగట్ నిర్ణీత బరువు పెరిగారు. ఉండాల్సిన బరువు కంటే 100 గ్రాములు పెరగడంతో అనర్హత వేటు పడింది. ఈ మేరకు పారిస్ ఒలింపిక్ నిర్వాహకులు ప్రకటించారు. వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు పడటంతో క్రీడాభిమానులు షాక్‌కు గురయ్యారు. బంగారు పతకానికి అడుగుదూరంలో ఉండగా ఇలా జరిగిందని బాధ పడుతున్నారు. రెజ్లింగ్‌లో స్వర్ణమో ..రజతమో ఖాయమని అనుకుంటున్న దశలో అనూహ్యంగా అనర్హత వేటు పడటంతో దేశమంతా నివ్వెర పోయింది. రాజకీయ, సినీ, క్రీడా రంగ ప్రముఖులెందరో ఈ విషయంలో స్పందించారు. ఇది దురదృష్టకరమని, ఇలా జరిగి ఉండాల్సింది కాదని పేర్కొంటున్నారు. సామాజిక మాధ్యమాలలో వినేశ్‌పై సానుభూతి వెల్లువెత్తుతోంది. మరోవైపు ఈ అనర్షతవేటుపై రాజకీయ దుమారం కూడా చెలరేగుతోంది.

**100 గ్రాములు బరువు ఎక్కువ ఉందని వినేశ్ ఫోగట్ పై అనర్హత వేటు**

రెజ్లింగ్ ఫైనల్ ముంగిట ఊహించని పిడుగు

నివ్వెర పోయిన క్రీడాలోకం

వినేశ్‌కు అండగా నిలచిన దేశం

నువ్వు ఛాంపియన్లకే ఛాంపియన్ అన్న మోదీ

రాష్ట్రపతి, క్రీడామంత్రి, వివిధ రంగాల ప్రముఖుల దిగ్భ్రాంతి

అనారోగ్యానికి గురైన స్టార్ రెజ్లర్

11

### భారతీయుల హృదయాల్లో మీరే ఛాంపియన్



పారిస్ ఒలింపిక్స్‌లో రెజ్లర్ వినేశ్ ఫొగాట్ చేసిన అసాధారణ విన్యాసాలు ప్రతి భారతీయుడిని ఉర్రూతలూగించాయని, దేశాన్ని గర్వించేలా చేశాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ అభిప్రాయపడ్డారు. వినేశ్‌పై అనర్హత నిరాశ పరిచినప్పటికీ, ఆమె 140 కోట్ల మంది భారతీయుల హృదయాల్లో ఛాంపియన్‌గా మిగిలిపోయారని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ లో పోస్ట్ చేశారు.

### వినేశ్, నీకెప్పుడు అండగా ఉంటాం'

అనర్హత వేటుపై మోదీ



పారిస్ ఒలింపిక్స్‌లో రెజ్లర్ వినేశ్ ఫోగాట్‌పై విధించిన అనర్హత వేటు పట్ల ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఓ ట్వీట్ ద్వారా ఆమెను ఓదార్చారు. "వినేశ్, నువ్వు ఛాంపియన్లకే ఛాంపియన్! నీ ప్రతిభ దేశానికే గర్వకారణం. భారతీయులందరికీ నువ్వు ఓ ఇన్‌స్పిరేషన్. ఈ రోజు నీకు తగిలిన ఎదురుదెబ్బ నన్ను ఎంతగానో బాధించింది. దీన్నిపై విచారం వ్యక్తం చేయడానికి నా దగ్గర మాటలు కూడా లేవు. కానీ, ఈ బాధ నుంచి బయటపడి నువ్వు మరింత బలంగా తిరిగి రాగలవని నేను నమ్ముతున్నాను. కఠినమైన సవాళ్లను ఎదిరించడం నీ నైజం. మేమంతా నీకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం" అని మోదీ వినేశ్‌కు భరోసానిచ్చారు.

ఈనెల 15న సీతారామ ప్రాజెక్టు

## ప్రారంభం

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి
- నీటి పారుదల అధికారులతో సమీక్ష


2

## తెలంగాణ బిడ్డలే స్థానికేతరులవుతారు

- ఎంబీబీఎస్ కోర్సుల ప్రవేశాల జీవోపై హరీశ్‌రావు ఆగ్రహం
- తెలంగాణ రాకముందు 40 శాతం ఉద్యోగాలు స్థానికేతరులకు దక్కేవి
- కేసీఆర్ 95 శాతం ఉద్యోగాలు తెలంగాణ బిడ్డలకే దక్కేలా జీవో 124 తీసుకొచ్చారు.


2

రాజ్యసభ స్థానాలకు ఎన్నికల

## నోటిఫికేషన్ విడుదల

రాజ్యసభలో ఖాళీ అయిన స్థానాలకు షెడ్యూల్ విడుదల అయింది. 9 రాష్ట్రాల పరిధిలో ఉన్న 12 స్థానాలకు సంబంధించి పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడికి సంబంధించి తాజాగా అన్ని తేదీలను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. అయితే ఇందులో తెలంగాణ నుంచి కూడా ఓ స్థానం ఖాళీగా ఉంది. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సీనియర్ నేత కే కేశవరావు.. రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి కూడా ఉపఎన్నిక జరగనుంది.



2

## ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తాం

- అధికారం అనుభవించడానికి కాదు.. అది ఓ బాధ్యత
- కొద్ది రోజుల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తాం
- 4,5 నెలల్లోనే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పనులు మొదలుపెడతాం
- ఆదిలాబాద్ జిల్లా పిప్రి సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు


2

## ఖమ్మం, వరంగల్ రైల్వే అలైన్‌మెంట్ మార్చండి

దక్షిణమధ్య రైల్వే జీఎంకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వినతి


2



## గ్రామాలకు తరలండి

- ఒక్కో కార్పొరేట్ కంపెనీ.. ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకోవాలి
- వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం సీఎస్ఆర్ నిధులు వెచ్చించండి
- కార్పొరేట్ కంపెనీలను కోరిన మంత్రి సీతక్క
- సంసిద్ధత వ్యక్తం చేసిన దిగ్గజ ఐటీ కంపెనీలు

2

## చేనేత రంగం అభివృద్ధికి శాశ్వత పథకాలు

- నేతన్నలకు మేలైన జీవితం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 75 | ₹ 97 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 141 | ₹ 160 |

## పడతాం, లేస్తాం.. కానీ తలవంచం

- బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అంటూ వార్తలపై కేటీఆర్ ఆగ్రహం
- తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే న్యాయపరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరిక
- 24 సంవత్సరాలుగా ఇలాంటి అనేక కుట్రలు, కుతంత్రాలు, కుట్రదారులను ఎదుర్కొన్న పార్టీ మాది
- ఎప్పటికైనా, ఎన్నటికైనా జై తెలంగాణ అంటూ కేటీఆర్ ట్వీట్


2

## రగులుతున్న బంగ్లాదేశ్

వెంటాడి, వేటాడి హసీనా పార్టీ నేతల ఊచకోత

హీరోను కూడా వదల్లేదు!

వందలాది మంది మృత్యువాత



**ఢాకా:** బంగ్లాదేశ్‌లో నిరసనలు ఇంకా చల్లారడం లేదు. ఆందోళనల నేపథ్యంలో ఆ దేశ ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేసి దేశం వదలి వెళ్లారు. అయితే, నిరసనకారులు మాత్రం హసీనా పార్టీ అవామీ లీగ్ పార్టీకి చెందిన నేతలను వేటాడి ఊచకోత కోస్తున్నారు. ఇప్పటి వరకూ జరిగిన దాడుల్లో 20 మంది అవామీ లీగ్ నేతలు మృతి చెందినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. రిజర్వేషన్ల రద్దుకోసం జరిగిన హింసాకాండలో బంగ్లాదేశ్‌లో వందల మంది నిరసనకారులు మిగతా9లో...

# చేనేత రంగం అభివృద్ధికి శాశ్వత పథకాలు

**విశ్వంభర, హైదరాబాద్:** చేనేత రంగం మన దేశపు పురాతన సంపద, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, చేనేత కళను ప్రపంచ వ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలు తీసుకురావడానికి ప్రభుత్వం శాశ్వత పథకాలు చేపట్టనుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర-రావు అన్నారు. బుధవారం చేనేత జౌళీ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజా లో నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని చేనేత ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రాచీన సంప్రదాయ కళలకు ప్రతిబింబాలైన నేత కళ కు ప్రపంచవ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చేందుకు శాశ్వత పథకాలను చేపట్టనున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని తెలిపారు. నేతన్నల అంకితభావం, సృజనాత్మకత దేశానికి గర్వకారణమని అన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి ధరించి నేతన్నకు చేయూత నివ్వాలని అన్నారు.నేతన్నలకు మేలైన జీవత్యా-న్ని ఇంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి చేనేత కళాకారునికి ప్రభుత్వ సహకారం అందాలి తెలిపారు . నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపే బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. ప్రపంచానికి పోటీపడే పద్ధతులు నేర్చుకొ-ని నేత ఉత్పత్తులను తయారు చేయాలని పేర్కొన్నారు. నేతన్నకు చేయూత పథకం కింద 2024-25 బడ్జెట్ లో 36,133 మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూర్చేందుకు 90 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. నేతన్న బీమా ద్వారా రాష్ట్రంలో 36777 మంది చేనేత కార్మికులు, అనుబంధ కార్మికులకు లబ్ధి చేకూర్చేందుకు ఈ ఆర్థిక సంవత్సరానికి 15 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. తెలంగాణలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐ ఐ హెచ్ టి) నెలకొల్పడానికి నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. నేతన్న బీమా పథకం కింద ఇప్పటివరకు124 డెత్ క్లెయిమ్స్ ఒక్కొక్కరికి ఐదు లక్షల చొప్పున 6 .20 కోట్లు వారి నామినీ ఖాతాలకు జమ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుల కింద మంత్రి 32మంది నేత డిజైనర్లకు ప్రతిభా పత్రం , జ్ఞాపిక, శాలువాతోపాటు ఒక్కొక్కరికి రూ 25 వేల నగదు పురస్కారం అందించారు.

# ఖమ్మం, వరంగల్ రైల్వే అలైన్ మెంట్ మార్చండి

ఖమ్మం , వరంగల్ జిల్లాల మీదుగా దక్షిణ మధ్య రైల్వే కొత్తగా ఏర్పాటు చే-యనున్న రైలు మార్గాల్లోని అలైన్ మెంట్ లో మార్పులు చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ కు సూచించారు. ఈ మేరకు బుదవారం రైల్ నిలయం లో జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తో మంత్రి సమావేశమయ్యారు. డోర్నకల్ నుంచి ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయక్ గూడెం మీదుగా సూర్యపేట జిల్లా మోతే నుండి గద్వాల్ వరకు ప్రతిపాదించిన నూతన రైల్వే మార్గం ఖమ్మం జిల్లాలోని తన నియోజ-కవర్గం పాలేరు లోని నాలుగు మండల మీదుగా ఈ రైల్వే మార్గం వెళ్తుందని, దీనివల్ల సాగు భూమలను రైతులు కోల్పోవలసి వస్తుందని, దీనికి ప్రత్యామ్నా-యంగా అలైన్ మెంట్ లో మార్పుచేసి మరో మార్గంలో రైల్వేలైన్ ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటి (కుడా) మాస్టర్ ప్లాన్ ను పరిగణనలోకి తీసుకొని వరంగల్ నగర బైపాస్ రైల్వే లైన్ ను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్ నగర అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని 2050 కి అనుగుణంగా మాస్టర్ ప్లాన్ ను సిద్దం చేస్తోందని, ఈ నేపథ్యంలో రైల్వే శాఖ నష్కల్ నుండి హసన్ పర్తి, నష్కల్ నుండి చింతల-పల్లి వరకు కొత్తగా నిర్మించతలపెట్టిన రైల్వే మార్గాన్ని వరంగల్ మాస్టర్ ప్లాన్ కు అనుసంధానం చేయాలని కోరారు. ప్రస్తుతం సిద్ధం చేసిన రైల్వే మార్గం వల్ల వరంగల్ మాస్టర్ ప్లాన్ దెబ్బతింటోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని అలైన్ మెంట్ మార్చాలని జి.ఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి. శాఖ, ప్రత్యేక కార్యదర్శి, హరి చందన తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 15న సీతారామ ప్రాజెక్టు ప్రారంభం

**విశ్వంభర, హైదరాబాద్:** ఈనెల 15న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల వేళ సీతారామ ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్ ల పురోగతి, నిర్మించాల్సిన ప్రాజెక్టులపై నీటిపారుదల శాఖ అధికా-రులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులు వేంగంగా పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రూట్‌మ్యాప్ సిద్ధం చేసిందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. 2025 డిసెంబరు నాటికి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. బుధవారం హైదరాబాద్ లోని జలసౌధలో పాలమూరు రంగారెడ్డితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్ ల పురోగతి, నిర్మించాల్సిన ప్రాజెక్టులపై నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీలు, సంబంధిత అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నా-రు. సీతారామ ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ముందు వైరాలో బహిరంగసభ ఏర్పాటు చేస్తు-న్నట్లు చెప్పారు.

# ఏపీ కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు

**విశ్వంభర, అమరావతి :** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రిమండలి సమావేశమైంది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ర్యాటిఫికేషన్ సహా వాలంటీర్ల వ్యవస్థ, రాష్ట్రవ్యాప్తంగా భూ అక్రమాలపై వస్తున్న ఫిర్యాదులు చేపట్టాల్సిన చర్యలపైనా కేబినెట్‌లో చర్చించనున్నారు. అదేవిధంగా స్థానిక సంస్థలు, సహకార సంఘాల్లో నిబంధనలపై చర్చించే అవకాశం ఉంది. ముగ్గురు పిల్లలుంటే పోటీకి అనర్హత నిబంధనను తొలగించే అంశంపై చర్చలు జరపనున్నారు. ఎన్నికల హామీగా ఈ నిబంధనను తప్పిస్తామని కూటమి ప్రభుత్వం స్పష్టం చేసింది. అదేవిధంగా మావోయిస్టులపై నిషేధం పొడిగిస్తూ మంత్రివర్గంలో తీర్మానం చేసే అవకాశం ఉంది. రామాయపట్నం పోర్టు అంశంతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎయిర్‌పోర్టులు, ఎయిర్ స్ట్రిప్‌ల నిర్మాణానికి సంబంధించిన అంశంపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు వేర్వేరు ప్రభుత్వ రంగ సంస్థలు, శాఖల్లో జరిగిన అక్రమాలపై విచారణకు సంబంధించిన అంశంపై కూడా చర్చించేందుకు ఆస్కారం ఉంది. అన్న క్యాంటీన్లు సహా సంక్షేమ పథకాల అమలుకు కేబినెట్ ఆమోదాన్ని తెలపనుంది. అదేవిధంగా మత్స్యకారుల జీవనోపాధికి గండి కొట్టేలా గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 217 జీవో రద్దుపై మంత్రిమండలి కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే గత ప్రభుత్వంలోని ఎక్సైజ్ అవతవకలపై, నూతన ఎక్సైజ్ విధానంపైనా చర్చిస్తారని సమాచారం. మరోవైపు వైఎస్సార్సీపీ ప్రభుత్వం భూముల రీసర్వే పేరుతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని సీఎం చంద్రబాబు చెబుతూ వస్తున్నారు. వీటిపై కూడా కేబినెట్‌లో చర్చించి ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. కేబినెట్ భేటీ అనంతరం చంద్రబాబు గుంటూరు, బాపట్ల జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆయన హెలికాప్టర్‌లో బాపట్ల జిల్లా వేటపాలెంకు వెళ్లనున్నారు.

# రూ.400 కోట్లతో వివింట్ ఫార్మా విస్తరణ

- జీనోమ్ వ్యాలీలో కొత్తగా ఇంజెక్టబుల్స్ తయారీ యూనిట్
- వెయ్యి మందికి ఉద్యోగాల కల్పన
- అమెరికాలో సీఎం రేవంత్‌రెడ్డితో చర్చల అనంతరం ప్రకటన



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో పెట్టుబ-డులకు పేరొందిన కంపెనీలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. పెట్టుబడుల సమీకరణ లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తు-న్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం వివిధ కంపెనీల ప్రతినిధులు, ప్రపంచంలో పేరొందిన పారిశ్రామికవేత్తలతో సంప్రదింపులు జరుపుతోంది. ప్రపంచంలో పేరొందిన వివింట్ ఫార్మా కంపెనీ హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక ఇంజెక్టబుల్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. రూ.400 కోట్ల పెట్టుబ-డి పెట్టేందుకు ఈ కంపెనీ ముందుకు వచ్చింది. దీంతో దాదాపు 1000 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పటికే లైఫ్ సైన్సెస్‌కు గ్లోబల్ హబ్‌గా ఎదుగుతున్న తెలంగా-ణలో ఈ కంపెనీ పెట్టుబడులకు సిద్ధపడటం అందరినీ ఆకర్షిస్తోంది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఈ కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. అనంతరం పెట్టుబడులకు సంబంధించి కీలక ప్రకటన చేశారు.

**ఆవిష్కరణలను ప్రోత్సహిస్తాం..**
**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, " జీనోమ్ వ్యాలీలో పెట్టుబడులకు వివింట్ ఫార్మా కంపెనీ ముందుకు రావటంపై సంతోషం వ్యక్తం చేశారు. లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని.. అవసరమైన రాయితీలు, మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని చెప్పారు. తెలంగాణలో అన్ని పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉందని, జీనోమ్ వ్యాలీ ఔషధ కంపెనీలను తప్పకుండా ఆకర్షిస్తుందని ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. తమ ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలతో కొత్త కంపెనీలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయని, వివింట్ ఫార్మా కొత్త తయారీ కేంద్రం ఏర్పాట్లు తెలంగాణలో లైఫ్ సైన్సెస్ రంగం వృద్ధికి దోహదపడుతుందన్నారు. ఇప్పటికే జీనోమ్ వ్యాలీలో వివింట్ కంపెనీ రీసెర్చ్ అండ్ డెవెలప్‌మెంట్ కేంద్రం ఉంది. సుమారు రూ. 70 కోట్లతో నెలకొల్పిన ఈ సదుపాయాలతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో విస్తరించేందుకు కంపెనీ ప్రణాళికలు రూపొందించింది. అందులో భాగంగా వివింట్ కంపెనీ హైదరాబాద్లోనే తన మొదటి తయారీ కర్మాగారాన్ని స్థాపించనుంది. పరిశోధన, ఆవిష్కరణ కేంద్రంతో పాటు తయారీ యూనిట్, మౌలిక సదుపాయాల కల్పనకు జీనోమ్ వ్యాలీలో 5.5 ఎకరాలను కొనుగోలు చేసింది. ప్రధానంగా ఆంకాలజీ, క్రిటికల్ కేర్ విభాగాల్లో అత్యంత నాణ్యమైన ఇంజెక్టబుల్స్, ఔషధాలను ఈ కంపెనీ ఉత్పత్తి చేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్ కు అనుగుణంగా ఫార్మాస్యూటికల్ ఉత్పత్తుల తయారీకి అధునాతన తయారీ సామర్థ్యాలతో పాటు దేశంలోని నిపుణులకు ఉపాధినిచ్చేలా ఈ కంపెనీ ప్రయత్నిస్తోంది.

# ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తాం

**విశ్వంభర, ఆదిలాబాద్:** ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తున్నామని ఆయన వెల్లడించారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులకు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం పిప్రిలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటించారు. పిప్రిలో రూ.20 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి, వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ప్రసంగించిన ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించిన తన పాదయాత్ర ప్రధాన కారణమని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా అంటే వెనకబడిన ప్రాంతం కాదని, రాష్ట్రంలోని మిగతా జిల్లాలకంటే అగ్రభాగాన నిలిపే బాధ్యత తనదని భరోసా ఇచ్చారు. "ఇది ప్రజా ప్రభుత్వం. వచ్చే రూపాయి కూడా దుబారా కాకూడదని, ప్రజలకు ఉపయోగపడాలన్న ఆలోచనతో ముందుకు వెళ్తున్నామని అన్నారు . ఆనాడు మాట ఇచ్చి ఇక్కడ నుంచి వెళ్లాను, చిక్మాన్ ప్రాజెక్ట్ మీ చిరకాల వాంఛ. దీన్ని పూర్తిచేయాలని అడిగారు, నాటి పాదయాత్ర సందర్భంగా మీరు చెప్పిన ప్రతిమాట నాకు ఇప్పటికీ గుర్తే, దాన్ని పూర్తి చేయటమే



కాకుండా, తప్పనిసరిగా మీ భూములు మీకే ఇచ్చి, పట్టాలిస్తాం. ఆ పట్టాల ద్వారా ఆ భూమిలోకి మిమ్మల్ని తీసుకువెళ్లి భూములు దున్నిస్తాం. ఈ ధరణిని బంగాళాఖాతంలో వేస్తాం అని భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. వైఎస్సార్ హయాంలో ప్రారంభించిన ప్రాణహిత-చేవెళ్ల పథకాన్ని మళ్లీ తుమ్మిడిహెట్టి వద్దనే పునఃప్రారంభిస్తామని ఉపముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత పోటీపరీక్షలకు ఉపయోగపడేలా ప్రతి నియోజకవర్గంలో డా. బీఆర్ అంబేద్కర్ నాలెడ్జి సెంటర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇందిరమ్మ పక్కా ఇళ్లు పేరిట నియోజకవర్గానికి 3500 ఇళ్లు కేటాయించనున్నట్లు చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలైతే, ఎస్సీ, ఎస్టీలకు అదనంగా రూ. లక్ష కలిపి రూ.6 లక్షల వరకు చెల్లించనున్నట్లు తెలిపారు. చనాఖా-కోరాట, సదర్మాట్, పెద్దవాగు, పీపీరావు ప్రాజెక్టులను మంజూరు చేయటం సహా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అర్హులైన గిరిజన, గిరిజనేతరుల సాగుచేసుకుంటున్న పోడుభూములకు పట్టాలిప్పించి దగ్గరుండి దున్నిస్తానని భట్టివిక్రమార్క భరోసా ఇచ్చారు.

# తెలంగాణ అభివృద్ధిలో భాగం పంచుకుంటాం



(మొదటి పేజీ తరువాయి)


రోడ్ మ్యాప్‌ను రూపొందించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ప్రధా-నంగా స్కిల్ డెవెలప్‌మెంట్, రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు, నెట్ జీరో సిటీ, ఆరోగ్య సంరక్షణ, డయాగ్నస్టిక్స్, హెల్త్ ప్రొఫైల్ రంగాల్లో భాగస్వామ్యానికి అవస-రమైన సంప్రదింపులు జరిగాయి. ముఖ్యమంత్రితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ఆర్థిక శాఖ ముఖ్య కార్య-దర్శి రామకృష్ణారావు, సీఎంవో ఉన్నతాధికారులు శేషాద్రి, విష్ణు వర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల జీవన ప్రమాణాలు, పర్యావరణం, జీవనోపాధి, నైపుణ్యాల వృద్ధి, ఉద్యోగాలు, ఆర్థిక సుస్థిరతతో పాటు వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఇటీవల తమ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమాలన్నీఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం తాము చేపట్టబోయే ప్రాజెక్టులన్నీ యుద్ధప్రాతిపదికన అమలు చేసి తీరుతామని ప్రకటించారు. అన్నింటిలోనూ అత్యంత పారదర్శకతను పాటిస్తామని స్పష్టం చేశారు. ప్రాంతాల వారీగా చేపట్టే ప్రాజెక్టుల సాధ్యాసాధ్యాలు, వాటి అమలును వేగవంతం చేసేందుకు వివిధ విభాగాలకు చెందిన నిపుణుల బృందం ఏర్పాటు చేయాలనే ఆలోచనల-ను ప్రపంచబ్యాంకు బృందంతో పంచుకున్నారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు హైదరాబాద్ అభివృద్ధికి ముఖ్యమంత్రి అనుసరిస్తున్న సమతుల్య దృక్పథం మంచి ఫలితాలను అందిస్తుందని ప్రపంచ బ్యాంకు బృందం ఆశాభావం వ్యక్తం చేసింది. గతంలో భారత్ లో తమ భాగస్వామ్యంతో చేపట్టిన వివిధ ప్రాజెక్టులు సానుకూల ఫలితాలు అందించాయని గుర్తు చేసింది. చర్చల సం-దర్భంగా నెట్ జీరో సిటీ అభివృద్ధిపై ముఖ్యమంత్రి చూపిన చొరవపై ప్రపంచ బ్యాంకు బృందం మరింత ఆసక్తిని ప్రదర్శించింది. ప్రజా పాలనతో పాటు రాష్ట్రంలో సమగ్ర సమతుల్య అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తు-న్న తీరును చర్చల్లో పాలుపంచుకున్న ప్రపంచ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పరమేశ్వరన్ అయ్యర్ ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్రం ప్రపంచ బ్యాంకు లాంటి అంతర్జాతీయ ద్రవ్యసంస్థలతో కలిసి పని చేయాలని నిశ్చయించటం ఇదే మొదటి సారి. తెలంగాణలో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్, స్కిల్ యూ-నివర్సిటీ, సిటిజన్ హెల్త్‌కేర్, హైదరాబాద్ 4.0 ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కీలకమైన ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి అనుసరిస్తున్న భవిష్యత్తు వ్యూహాలకు ప్రపంచ బ్యాంకు మద్దతు మరింత ఊతమివ్వనుంది.

# గ్రామాలకు తరలండి

**విశ్వంభర, హైదరాబాద్:** వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కార్పొరేట్ కంపెనీలు తమ వంతు సహకారం అందించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. చివరి వరుసలో ఉన్న వారి అభివృద్ధి కోసం సామాజిక బాధ్యతగా కంపెనీలు ముందుకు రావాలని కోరారు. ఒక్కో కార్పొరేట్ కంపెనీ..ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి పరచాలని సూచించారు. హైదరాబాద్ లోని ప్రజా భవన్ లో మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, ములుగు కలెక్టర్ దివాకర్ లతో ఐటీ దిగ్గజ కంపెనీలైన మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, క్వాల్కమ్, బోష్, గ్రాన్యుల్స్ ఇండియా, టీసీఎస్, ఉషా, నిర్మాన్ తదితర కంపెనీల ప్రతినిధులు బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మనతో పాటు చుట్టూ ఉన్న వాళ్లు సంతోషంగా ఉండాలన్న లక్ష్యంతో కార్పొరేట్ కంపెనీలు పని చేస్తే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్పొరేట్ కంపెనీలు ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకొని స్థానిక సమస్యలను పరిష్కరించడంతో పాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేలా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఆదిలాబాద్, ములుగు వంటి ప్రాంతాల్లో ఇప్పటికే కార్పొరేట్ కంపెనీలు కొన్ని గ్రామాలను దత్తత తీసుకొని మార్పు చేసి చూపించాయని మంత్రి గుర్తు చేశారు. విద్య, వైద్యం,ఉపాధి, పారిశుద్ధ్య నిర్వహణ, మంచినీరు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో చేయూతనిచ్చేలా కంపెనీలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజలకు సహాయం చేస్తే గుండెల్లో పెట్టి చూసుకుంటారని పేర్కొన్నారు. ప్రజాసేవలో సంతృప్తి పొందిన వారే అసలైన శ్రీమంతులని తెలిపారు. ములుగు జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులను, అవసరాలను, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కలెక్టర్ దివాకర్ వివరించారు. మంత్రి పిలుపుమేరకు ములుగు వంటి నియోజకవర్గాల్లో సిఎస్ఆర్ నిధులను వెచ్చించేందుకు, అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకునేందుకు ముందుకు వచ్చిన ఆయా కంపెనీలను మంత్రి సీతక్క అభినందించారు.

# తెలంగాణ బిడ్డలే స్థానికేతరులవుతారు

**విశ్వంభర, హైదరాబాద్:** మెడికల్ అడ్మిషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నిబంధనలు సరిగా లేని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. వీటి వల్ల మన పిల్లలే ఇక్కడ స్థానికేతరులుగా మారే అవకాశం ఉందన్నారు. 95 శాతం ఉద్యోగాలు స్థానికులకు దక్కేలా కేసీఆర్ చేశారని.. అదే పద్ధతిని విద్య విషయంలోనూ అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్‌కు ఏ అంశంపైనా స్పష్టత లేదని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో హరీశ్ రావు బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఎంబీబీఎస్ అడ్మిషన్లకు వైద్యవిద్యా శాఖ ఇచ్చిన జీవోతో తెలంగాణ బిడ్డలు తెలంగాణకు స్థానికేతరులుగా మారే ప్రమాదముందని హెచ్చరించారు. నీళ్లు, నియామకాలు, నిధుల ఆకాంక్షలను కేసీఆర్ నెరవేర్చారు. నీళ్లు, ఉద్యోగాలు దక్కాయని చెప్పారు. తెలంగాణ రాకముందు 40 శాతం ఉద్యోగాలు స్థానికేతరులకు దక్కేవి. కేసీఆర్ 95 శాతం ఉద్యోగాలు తెలంగాణ బిడ్డలకే దక్కేలా జీవో 124 తీసుకొచ్చారని హరీష్ రావు గుర్తు చేశారు. విద్య అడ్మిషన్లను ఉమ్మడి రాష్ట్రంలోని పాత పద్ధతి కింద 15 శాతం ఓపెన్ కాంపిటీషన్ మరో పదేళ్ల పాటు ఇవ్వాలని విభజన చట్టంలో ఉందని గుర్తు చేశారు. 1979లో జీవో 644లో విద్యా ప్రవేశాల్లో స్థానికతను ఆంధ్రా, తెలంగాణ, రాయలసీమకు నిర్ణయించారు. ఆ ప్రాంతాల్లో నాన్ లోకల్ విద్యార్థులకు అవకాశం



ఉండదన్నారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత రెసిడెన్షియల్ ఆర్డర్ ఆధారంగా జీవో నంబర్ 114 ప్రకారం పాత నిబంధనను పదేళ్లపాటు కొనసాగించాలని అందులో ఉందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం లో 2,850 సీట్లను ఎంబీబీఎస్ సీట్లను 9 వేలకు పెంచిందన్న హరీష్ రావు, తెలంగాణ వచ్చేనాటికి ఉన్న కాలేజీల్లో మాత్రమే 15 ఓపెన్ కాంపిటీషన్ కోటా అమలు చేశాయన్నారు. రాష్ట్రం వచ్చాక ఏర్పాటు చేసిన కాలేజీల్లో వంద శాతం సీట్లు తెలంగాణకే ఇచ్చామని, దీంతో 520 సీట్లు అదనంగా మనకు వచ్చాయన్నారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో బీ కేటగిరీలో లోకల్ స్టూడెంట్లకే ఇవ్వాలని జీవో తెచ్చామన్న హరీశ్‌రావు, దీంతో 24 కాలేజీల్లో తెలంగాణ పిల్లలకు 1071 సీట్లు వచ్చాయన్నారు. తెలంగాణ పిల్లలు డాక్టర్ల కావాలనే తపనతో కేసీఆర్ ఈ పనిచేశారన్నారు. మన పిల్లలకు అడ్మిషన్ల కోసం స్థానికతను నిర్ధారించుకోడానికి కొత్త సమగ్ర విధానం రూపొందించుకోవాల తెలిపారు. సర్కార్ కొత్త జీవో ప్రకారం తెలంగాణ విద్యార్థులు ఇంటర్ రెండేళ్లు వేరే రాష్ట్రంలో చదివితే, లాంగ్ టర్మ్ కోచింగ్‌కు వెళ్తే నాన్ లోకల్ అయిపోరా? అని హరీశ్ రావు ప్రశ్నించారు. మన తెలంగాణ బిడ్డలు వేరే దేశాల్లో, రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ చదువుతున్నారు. ఈ నిబంధన ప్రకారం వాళ్లు పీజీ సీట్లకు నాన్ లోకల్ అయిపోతారని హరీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడులో మాదిరి రూల్స్ ఫ్రేమ్స్ చేయాలని రాష్ట్ర సర్కార్‌కు హరీశ్‌రావు సూచించారు. అక్కడ ఎంబీబీఎస్ సీటు రావాలంటే ఆరు నుంచి పది వరకు అక్కడ చదువుకుని, తల్లిదండ్రులు స్థిర నివాసం కలిగి ఉండాలన్నారు. కర్నాటక, కేరళలకు వాటి నిబంధనలు ఉన్నాయి. తెలంగాణకు కూడా సొంత రూల్స్ కావాలన్నారు. చీఫ్ సెక్రటరీ, ఇతర ఉన్నతాధికారులతో ఒక కమిటీ వేసి విధానం రూపొందిస్తే అన్ని విద్యాసంస్థలకు మార్గదర్శకత్వం అవుతుందన్నారు. హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గా పదేళ్ల పాటు ఉన్నందువల్ల పార్లమెంటు చట్టం ప్రకారం మేము పాత పద్ధతి కొనసాగించామని హరీశ్ తెలిపారు. పదేళ్ల కాలం ముగిసినా రాష్ట్ర ప్రభుత్వం పాత పద్ధతినే కొనసాగించడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే జీవో 33 లో సవరణలు తేవాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ఈ అంశంపై అఖిలపక్షాన్ని పిలిస్తే సూచనలు ఇస్తామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కమిటీ వేయాలన్న హరీశ్ రావు, జీవోకు సవరణ చేయాలని డిమాండ్ చేశారు.

# పడతాం, లేస్తాం... కానీ తలవంచం

**విశ్వంభర, హైదరాబాద్:** భారతీయ జనతా పార్టీలో భారత రాష్ట్ర సమితి విలీనం అవుతుందంటూ వస్తున్న వార్తలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కేటీఆర్ హెచ్చరించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన ఘాటుగా స్పందించారు. నిరాధారమైన దుష్ప్రచారం చేస్తున్న వారు వెంటనే ప్రజలకు వివరణ ఇవ్వాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు. 24 సంవత్సరాలుగా ఇలాంటి అనేక కుట్రలు, కుతంత్రాలు, కుట్రదారులను ఎదుర్కొన్న పార్టీ తమదని చెప్పారు. అన్నీ దాటుకొని నిబద్ధత, పట్టుదలతో అవిశ్రాంతంగా పోరాడి తెలంగాణ సాధించిన పార్టీ బీఆర్ఎస్ అని చెప్పుకొచ్చారు. సాధించుకున్న తెలం గాణను సగర్వంగా నిలబెట్టుకొని, అభివృద్ధిలో అగ్ర భాగాన నిలిపినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. ఆత్మగౌరవం, అభివృద్ధి పర్యాయపదాలుగా మార్చుకొని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దినట్లు కేటీఆర్ వివరించారు. కోట్లాది గొంతుకలు, హృదయాలు, తెలంగాణ ఆత్మగౌరవం, తెలంగాణ గుర్తింపు కోసం చేస్తున్న పోరాటం వల్లే సాధ్యమైందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎప్పటిలానే బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల కోసం నిలబడుతుందని, పోరాడుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇప్పటికైనా అడ్డగోలు అసత్యాలు, దుష్ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. 'పడతాం, లేస్తాం, తెలంగాణ కోసమే పోరాడతాం! కానీ తలవంచం. ఎప్పటికైనా, ఎన్నటికైనా! జై తెలంగాణా!' అంటూ కేటీఆర్ తన ట్వీట్‌ను ముగించారు. కాగా, బీజేపీలో బీఆర్ఎస్ విలీనమవుతుందంటూ పలు మీడియా, సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న క్రమంలో కేటీఆర్ ఈ మేరకు తీవ్రంగా స్పందించారు.




## ఓబీసీలు రాజ్యాధికారం చేపట్టే

# దిశగా ముందుకుసాగాలి

**- ఎంపీ వద్దిరాజు**

**విశ్వంభర, న్యూఢిల్లీ:** దేశ జనాభాలో అత్యధిక శాతంగా ఓబీసీలు తమ న్యాయమైన హక్కుల సాధనకు పోరాడుతూ రాజ్యాధికారం చేపట్టే దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని భారత రాష్ట్ర సమితి పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఉద్ఘాటించారు. మండల్ దివస్ ఉత్సవాలలో భాగంగా ఆలిండియా ఓబీసీ విద్యార్థి సంఘం(ఏఐఓబీసీఎస్ఏ) ఆధ్వర్యంలో ఢిల్లీలోని కానిట్యూషనల్ క్లబ్ ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీ రవిచంద్ర రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ తమ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు సబ్బండ వర్గాలను ఏకోన్ముఖులను చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాకారం చేశారన్నారు. తెలంగాణ అసెంబ్లీ తొలినాళ్లలోనే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళా రిజర్వేషన్స్ పెంపుదలకు, అమలునకు ఏకగ్రీవంగా తీర్మానించడాన్ని గుర్తు చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్స్ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడాన్ని ప్రస్తావిస్తూ ఏంఆర్పీఎస్ నాయకులు మంద కృష్ణకు కేసీఆర్ మొదటి నుంచి సంపూర్ణ మద్దతునిచ్చారని ఎంపీ రవిచంద్ర వివరించారు. ఓబీసీల న్యాయమైన డిమాండ్స్ విషయమై ఢిల్లీలో సుదీర్ఘ చర్చ జరిపి పాలకుల దృష్టికి తేవడం, దేశ ప్రజలకు వివరించడం శుభ పరిణామం అన్నారు. దేశంలో కులగణనను చేపట్టి పూర్తి చేయడం ద్వారానే మహిళా రిజర్వేషన్స్ అమలు సాధ్యమవుతుందన్నారు. కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, చట్టసభలలో రిజర్వేషన్స్ కల్పించాలని ఎంపీ వద్దిరాజు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన హక్కుల సాధనకు ఓబీసీలు జరిపే ఉద్యమాలకు తమ పార్టీ అండగా ఉంటుందని, సంపూర్ణ మద్దతునిస్తుందని ఆయన హామీనిచ్చారు. ఈ సందర్భంగా ఎంపీలు రవిచంద్ర, ఆర్.కృష్ణయ్య, మాజీ మంత్రి వీ.శ్రీనివాస్ గౌడ్ తదితర ప్రముఖులు గోడ పత్రికను ఆవిష్కరించారు.

# జనాభా ప్రకారం రిజర్వేషన్ ఇవ్వాలి

**ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మెన్ పిడమర్తి**



**విశ్వంభర, హైదరాబాద్:** ఎస్సీ వర్గీకరణలో అత్యంత వెనకబడిన ఉపకులాలకు ప్రాధాన్యత ఇచ్చి ప్రత్యేక కేటగిరీలు కేటాయించాలని, జనాభా ప్రకారం రిజర్వేషన్ ఇవ్వాలని ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మెన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విముక్త చిరుతల కచ్చి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణలో ఉపకులాల కోటా అనే అంశం మీద జరిగిన రౌండు టేబుల్ సమావేశంలో ఆయన మాట్లారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీకే చెన్నై హెడ్ క్వార్టర్స్ కార్యదర్శి బాలసింగం మాట్లాతూ సామాజిక న్యాయం అమలు కావాలని కోరే పార్టీగా వీసీకే రిజర్వేషన్ వర్గీకరణ అంశాన్ని సమర్థిస్తుంది అన్నారు. ఉపకులాలకు న్యాయం జరగకూడదని ఆయన కోరారు. తలైవర్ తిరుమావళవన్ వర్గీకరణలో ఉపకులాలకు కోటా కేటాయించాలని ప్రకటించారని . తెలంగాణలో వీసీకే సామాజిక న్యాయ పోరాటాన్ని కొనసాగిస్తుంది అని తెలిపారు. ఇల్లు అలకగానే పండుగకాదని, కొన్ని శక్తులు వర్గీకరణ అమలు కాకుండా అడ్డుపడుతున్నాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ అన్నారు. జనాభా లెక్కలు తేలాలని పసునూరి రవీందర్ అన్నారు. ఉపకోటాను బీఎల్పీ అధ్యక్షులు నల్లా సూర్య ప్రకాశ్ అన్నారు. ఈ కార్యక్రమంలో వీసీకే సెంట్రల్ కమిటీ నాయకులు నీలవత్తు నెలవన్, వీసీకే రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మచ్చ దేవేందర్, జనరల్ సెక్రటరీ చెరిపెల్లి ఆనంద్, కోశాధికారి దానబోయిన రవి, కార్యదర్శులు నల్లా రమేష్, కొయ్యడ కిరణ్, మంచింటి అంజయ్య, కోటేశ్వర్‌రావు, కెయు జాక్ నాయకులు డాక్టర్ వీరేందర్, మాదిగ నాయకులు మైస ఉపేందర్, నక్కా మహేష్, ప్రముఖ కవి దాసోజు లలిత, ప్రొ. ప్రభంజన్ యాదవ్, పోషం అశోక్, బైండ్ల కుల నాయకులు మారపాక మనోహర్, విజయ్, జ్యోతి పాల్గొన్నారు.





**ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ ప్రీతంని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దాము మహేందర్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్‌నాయకులు.**

– విశ్వంభర, హైదరాబాద్

# సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ



**విశ్వంభర, హైదరాబాద్:** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బెంగాల్ హ్యాండ్లూమ్ ఆర్ట్ సిల్క్ ఆఫ్ ఇండియా అధికారిక పోస్టర్‌ను నిర్వాహకులు సోమ్‌నాథ్ బౌమిక్, అభిజిత్‌షా మోడల్స్‌తో కలిసి సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో ఆవిష్కరించారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ఎగ్జిబిషన్‌లో చేనేత వస్త్రాలు, సాంప్రదాయ చేతిపనుల అసాధారణ ప్రదర్శనతో ఏర్పాటు చేయనున్నారు. ఎగ్జిబిషన్ క్లాసిక్ గార్డెన్‌లో ఆగస్టు 12 నుంచి ఆగస్టు 18 వరకు కొనసాగనుందని సోమనాథ్ తెలిపారు. ప్రతిభావంతులైన నేత కార్మికులను ప్రోత్సహించడానికి సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని అభిజిత్ అన్నారు. ఎగ్జిబిషన్లో బనారసి చీర, భాగల్‌పురి సిల్క్, బెంగుళూరు సిల్క్, చెన్నై సిల్క్, మైసూర్ సిల్క్, ధర్మవరం, పోచంపల్లి, జమ్దానీ, లెనిన్ కాటన్, టస్సార్, విష్ణుపురి సిల్క్, డ్రెస్ మెటీరియల్, చందేరి మొదలైన వాటిని ప్రదర్శించనున్నట్లు తెలిపారు.






# నూతన విశ్వ విద్యాలయాలు ఎంతో అవసరం

రోజు రోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఉపాధి నైపుణ్యాలతో విద్య, విజ్ఞానం అందించే విశ్వ విద్యాలయాలు ఏర్పాటు చేయడం అవసరం. గతంలో జిల్లాకో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారు. అవి పాత కోర్సులకు పరిమితమయ్యాయి. వాటి విస్తరణ కు నిధులు ఇవ్వక పోవడం వల్ల ఎండిపోతున్నాయి. తెలుగు యూనివర్సిటీ, ఉద్యాన విశ్వ విద్యాలయం వంటి వాటిద్వారా ఎంత మందికి నూతన ఉపాధి లభించిందో లెక్కలు లేవు. ఇక నుండి ప్రతి యూనివర్సిటీ తన విద్యార్థులకు ఎంతమందికి ఏయే ఉపాధి లభించిందో రోస్టర్ రిజిస్టర్ నిర్వహించడం అవసరం. అపుడే పెట్టే బడ్జెట్ కు మేధో శ్రమశక్తి సమాజంలో నిత్య జీవితంలో వికాసానికి ఎంతమేరకు ఉపయోగ పడుతుందో తెలుస్తుంది.

వాన నీళ్లను ఒడిసి పట్టడానికి చెరువులు కుంటలు ప్రాజెక్ట్ లు కట్టడం జరిగింది. ఒకవైపు నీటి కొరత మరో వైపు దేశంలో 70 వేల టీఎంసీలు, రాష్ట్రంలో. 4 వేల టీఎంసీల నీరు సముద్రంలో వృథాగా కలుస్తున్నాయి. మానవ వనరుల సంగతి కూడా ఇలాగే ఉంది. ఒకవైపు నైపుణ్యాలు కొరత, మరోవైపు నిరుద్యోగం కొనసాగుతున్నాయి. వ్యక్తిగతంగా తీసుకున్న రుణాలు మాఫీ పేరిట 30 వేల కోట్లు పంచి, వెయ్యి రెండు వేల కోట్ల పెట్టుబడులకోసం విదేశాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రయివేటు వైద్యం కోసం పెడుతున్న ఆరోగ్యం సొమ్ముతో ప్రభుత్వ ఆసుపత్రులు ఎన్నో కట్టవచ్చు.

నిరుద్యోగాన్ని గ్రామాల నుండి లెక్క వేయాలి. పారిశ్రామిక ఉత్పత్తులు మార్కెటింగ్ తో గ్రామీణ స్వయంపోషక ఆర్థిక వ్యవస్థ శిథిలమై పోయింది. వ్యవసాయంలో యంత్రాలు, కూలీలను నిరుద్యోగులను చేశాయి. చేతివృత్తులను యంత్రాలు ఆక్రమించాయి. చేనేత వంటివి చితికి పోయాయి. . గ్రామీణ జనాభాలో వెయ్యి మందికి 550 మందికి పని లేకుండా పోయింది. కరెంటు , ఆటోలు, బైకుల రిపేరు, , ట్రాక్టర్ డ్రైవర్, టీచర్లు భవన నిర్మాణం వంటి పనులతో వందమందికి ఉపాధి కల్పించగా మిగతా 450 మందికి పని లేకుండా అయింది. వీరు ఇతరులమీద ఆధార పడి బతుకుతున్నారు., వలసలు పోతున్నారు. వారు జిల్లా పరిధి దాటి పోకుండా జిల్లాను ఉపాధినైపుణ్యాలలో స్వయం సమృద్ధి గా అభివృద్ధి చెందే ప్రణాళికలు అవసరం. గతంలో ప్రతి గ్రామం స్వయం సమృద్ధి గా ఉండేది. నేడు కనీసం జిల్లా పరిధిలోనైనా స్వయం పోషకంగా ఉపాధి నైపుణ్యాలు, సహజ వనరులు , యువతరం వనరులు వినియోగం లోకి తేవాలి. అందుకనువైన నూతన విశ్వ విశ్వ విద్యాలయాలను ఏర్పాటు చేయాలి.

సామాజిక వికాసానికి విద్య ఎంతో అవసరం. ఆ విద్య భారత రాజ్యాంగం మౌలిక లక్ష్యాల సాధనకు ఉపయోగపడాలి. మూఢ విశ్వాసాలను, రాజ్యాంగ లక్ష్యాలకు భిన్నమైన వాటిని తొలగించాలి. సంఘ సంస్కరణకు ఉపయోగ పడే విద్య అవసరం. ప్రజల కళలను అవగాహన ను అభివృద్ధి పరచాలి. గద్దర్ పేరిట అలాంటి ఒక విశ్వ విద్యాలయం అవసరం. సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం ద్వారా నాటి బౌద్ధ విశ్వ విద్యాలయాల వలె నేడు సమాజంలో మార్పుకు సన్నద్ధం చేయాలి. ఉపయోగ పడాలి. చేతివృత్తుల అభివృద్ధికి పరిశోధన తో కూడిన విశ్వ విద్యాలయం అవసరం. భవన నిర్మాణం లో 30- 40 నైపుణ్యాల ఉపాధి కల్పన జరుగుతుంది. అందువల్ల భవన నిర్మాణ నైపుణ్యాల విశ్వ విద్యాలయం ఏర్పాటు ఛేయాలి.

ఈయా రంగాల నిపుణులు అనుభవజ్ఞులు మేధావులు ప్రజల, ప్రభుత్వాల, రాజకీయ పార్టీల ఆలోచనా విధానాలను మలుపు తిప్పాలి. అవి ప్రజలు మారడానికి, ఉద్యమాలు చేయడానికి , పార్టీలు ఎన్నికల ప్రణాళికలో చేర్చుకోవడానిరి న్యాయమూర్తులు నూతన కోణాలతో తీర్పులివ్వడానికి సైంటిస్టులు నూతన అన్వేషణలు చేయడానికి , మానవీయ సంస్కృతిలో నూతన సంస్కృతిగా స్థిరపడడానికి ఉపయోగపడాలి.

మేధావులు ముందుచూపుతో ఆలోచించాలి. రాజకీయ నాయకులు వర్తమానం గురించి ఆలోచిస్తారు. మేధావులు వర్తమానంతో పాటు భవిష్యత్ గురించి ఆలోచించాలి. గురువులుగా సమాజాన్ని మలుపు తిప్పాలి. మేధావులకు అన్ని సమకూర్చే ఉద్యోగాలు, సౌకర్యాలు, జీత భత్యాలు , ఉద్యోగం లభించాక చాలా. మంది సోమరులై కుటుంబానికి, తమ ప్రమోషన్లకు పరిమితమై పోతున్నారు. గొప్ప గొప్ప క్వాలిఫికేషన్లు, హోదాలు, స్థానాల్లో ఉన్నవారు ఇలా మిన్నకుండి పోతున్నారు. సమాజ గమనాన్ని నిర్దేశించే బదులు ప్రేక్షకులుగా మారుతున్నారు.

గొప్ప గొప్ప పదవులు, విద్యార్హతలు , హోదాలు లేని వారు మాట్లాడితే వారిని పరిగణనలోకి తీసుకోవడం లేదు. పేదరికం వల్ల వారు చదువు కోలేక పోయారు. అనుభవం అధ్యయనం అవసరం వారి మేధస్సును వికసించ చేస్తుంది. మేధావులు సమాజం దీన్ని గమనించడానికి సిద్దంగా లేరు. అందువల్ల ఎన్నికల ఫలితాల ముందస్తు అంచనాలన్నీ మారి పోయే తీర్పులు చూసి ఆశ్చర్య పోతుంటారు.

ఇటీవల స్కిల్ డెవలప్ మెంట్ కోసం ఒక యూనివర్సిటీ పెట్టాలని అనడమే తడవుగా వందకోట్ల మూలధనంతో పాటు ముచ్చర్ల కందుకూరి మండలం మీరే ఖాన్ పేటలో ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రి, మంత్రులు భూమి పూజ చేశారు. 17 కోర్టులు ప్రకటించారనా. మూడు నాలుగు నెలల కోర్సు తోపాటు డిగ్రీ కోర్సులుంటాయని ఏటా 20 వేల మందికి శిక్షణ ఏర్పాట్లు చేస్తున్నామని ప్రకటించారు. దాన్నికార్య రూపంలోకి తెస్తున్న ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యులు అభినందనీయులు.

30 లక్షలమంది ఉద్యోగాలకోసం నిరీక్షిస్తున్నారని చెప్తుంటారు గానీ పరిష్కారాలు చూపించలేక పోయారు. నా మట్టుకు నేను తమిళనాడు స్కిల్ డెవలప్ మెంట్ ప్రోగ్రాములను అధ్యయనం చేశాను. బీసీ ఎస్సీ డిపార్టుమెంట్ల ద్వారా వారు 75 రకాల నూతన ఉపాధి కల్పనకు శిక్షణ ఉంది. భూదాన్ పోచంపల్లిలో 22 రకాల కొత్త పాత స్కిల్సు శిక్షణ నడుస్తున్నది. తమిళనాడులా మిగతా స్కిల్సు కూడా కలిపి 33 జిల్లాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావించాను. . గురుకుల పాఠశాల విద్య పిజివరకు పెంచి ఆయా డిపార్టుమెంటు పద్దులకిందనే యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలని సూచించాను. ఇప్పటికీ ఇది అవసరమే. అపుడు రిజర్వేషన్ల కోసం ఓసీలు బతిమాలుతారు.

స్కిల్ డెవలప్ మెంట్ యూనివర్సిటీ రూపంలోకి వచ్చి చేరాయి. వీటిలో చేరిన వారికి వసతి , భోజన సౌకర్యాలు కలిపించడం అవసరం. విదేశాల నుండి , చైనా నుండి ఎన్నో దిగుమతి చేసుకుంటున్నాము.వాటన్నిటిని ఇక్కడే ఉత్పత్తి చేసుకుంటే ఉపాధి పెరుగుతుంది . సంపద పెరుగుతుంది. ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. పరిశ్రమలు ప్రభుత్వ ప్రయివేటు కలయికతో ఏర్పాటు చేయడం అవసరం.

మన విదేశీ మారక ద్రవ్యం ఐటి సెక్టార్ ద్వారా 45 శాతం సమకూరుతున్నది.

కృత్రిమ మేధో సెక్టార్ తో ఉద్యోగాలు ఉపాధి కోత పడుతాయి. తద్వారా 80 శాతం మంది ఉపాధి కోల్పోతారు. ప్రభుత్వ ఆదాయం తగ్గుతుంది. రియల్ ఎస్టేట్ రంగం కుదేలవుతుంది. 7.5లక్ష ల మంది ప్రత్యక్షంగా ఐటి నిపుణులు తెలంగాణలో పని చేస్తున్నారు.20 లక్షల మంది పరోక్షంగా వీరి ద్వారా ఉపాధి పొందుతున్నారు.

అందువల్ల సంక్షోభం ముంచుకురాకముందే నూతన ప్రణాళికలు ఆలోచించాలి. హైదరాబాద్ లో నాలుగవ మహా నగరంగా ముచ్చెర్ల ప్రణాళిక ఒక గొప్ప ఆలోచన. అలాగే ఔటర్ రింగు రోడ్ ఆనుకొని 33 ప్రాంతాల్లో 33 జిల్లాల నుండి హైదరాబాద్ నగర సౌకర్యాలు వసతులు పొందడానికి గృహ నిర్మాణ సంస్థ, ప్రయివేటు కలయికతో లక్షలాది మందికి టౌన్షిప్‌లు నిర్మించాలి. తద్వారా కొన్నేళ్ల పాటు లక్షలాదిమంది కి ఉపాధి, వసతి, కాలుష్యం నివారణ ఏకకాలంలో పరిష్కారమవుతాయి.



- బి. ఎస్.రాములు
బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, తెలంగాణ
ఫోన్: 8331966987



## చదువుని వాడజ్ఞుండగుచు!!

ఒక్క సారి చదివేద్దామ్ రండి
శబ్దాడంబరం
సంధి పరిచ్ఛయాలు లేని
సాదాసీదా వాక్యాన్ని
వంకర టింకర సంకర భావాలు లేని
సరళతర పద్యాన్ని!

ముసురుకున్న
ఆలోచనలు గూడులో వినిపించే
ఒంటరి పక్షుల రోదనల్ని
పద పదంలో ఆలకిద్దాం రండి!

గాలి పటంలా ఊగిసలాడుతోన్న
బాంధవ్యాలను తెగేదాకా లాగకుండా
సంశ్లిష్ట వాక్యాల
మాంజాతో కలిపి కుట్టేద్దాం !

మనిషికీ మనిషికీ
మధ్య దూరాన్ని కలిపే
గుణసంధుల సుగుణాల
గల్పికను అవలోకిద్దాం!

అంతరాళాన్ని తడిమే భావ
సంపుటి ముందుమాటను
ముద్దుగా అమ్మ చేతి ముద్దగా
ఆరగిద్దామ్ రండి!

చదివిన కొద్దీ
బాధల చెలిమలు
దుఃఖ వలయాలు
ఆవేశపుటలలు!
నుడికారాల కడలి లో
చమత్కారాల చేప పిల్లల్ని
గూడార్థాల గులకరాళ్ళని
పట్టుకుందాం!

విశ్లేషణకందని
విరోధాభాసాలనూ
విమర్శకు దొరకని
యమకాలనూ
సావిత్రీ పటుత్వ స్ఫురద్దీపికల
ఒడుపునీ పట్టేద్దాం!

కంచికి చేరని కథలనూ
మనసు కుదిపే నవలలనూ
మదనపడ్డ చలం స్త్రీల
మనస్సు లోతుల్నీ
మధురవాణి మనోసౌందర్య భావ
రీతుల్నీ ఔపోసన పట్టేద్దాం రండి !

చదవడం అంటే
దశ తప్పి దిశానిర్దేశం
కోల్పోయిన జీవితపు గుండె చప్పుళ్లను
కొలిచే స్తెతస్కోప్ లో దూరడం
కన్నీటి పర్యంతమైన
కంఠంలో ఆరని తడిని
కొలిచే హైడ్రోమీటర్ లా మారడం !

చదవడం అంటే
ఆత్మను శుభ్రం చేసుకోవడం
అక్షరం ముందు వినమ్రుడై
తన్ను తానుసంస్కరించు కోవడం!

బోధి చెట్టు కింది బుద్ధునిలా
తేటతెల్లం అవడం
రెండు పక్షుల మనోవిషాదగీతం
విన్న వాల్మీకిలా స్పందించడం

అక్షరాగ్ని ధారలు కురిపించిన
దాశరథి హృదయ
ఫర్నేసులో అమాంతంగా దూకడం


చదువుదాం...
చదువుని వాడజ్ఞుండగుననుకుని
పోతన పద్యపాద రసాస్వాదనా గుణ
హీనుండగుననుకుని.....
జ్ఞాన కళికల వెలుగు కానని
కబోది సోదరుండగుననుకుని.......



- కె.ఎస్.అనంతాచార్య
కరీంనగర్
ఫోన్:: 9441195765

# విశాల సాహితి సృష్టించిన సామ్రాజ్యం

తెలుగు సాహిత్య సామాజిక, తాత్విక రంగాలలో విశాల సాహిత్య అకాడమీ తనదంటూ ఒక చరిత్రను సృష్టించింది. రాష్ట్రంలో పుస్తకం ప్రచురణ సంస్థలు ఎన్నో వున్నాయి. సామాజిక ప్రయోజనం కోసం, చైతన్యం భావజాలం వ్యాప్తి కోసం ఎన్నో ప్రచురణ సంస్థలు పని చేస్తున్నాయి. అలాంటి వాటిలో బి.ఎస్ రాములు ప్రారంభించిన విశాల సాహిత్య అకాడమీ ఒకటి. సమస్త వర్ణ, వర్గ, కుల, లింగ, జాతి, మత ప్రాంత, భాష, దేశ వివక్షలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య సోషలిజం, భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యాలతో కృషి చేయడం దీని విజన్. 1991 లో " గతితర్క తత్వ దర్శన భూమిక " తొలి ప్రచురణ గా వెలువడింది. ఈ పుస్తకం తెలుగునాట భావజాల తాత్విక రంగాలలో తీవ్రమైన చర్చకు తెర తీసింది. అంతదాకా కొనసాగుతున్న తమ తమ ఆలోచనలను, దృక్పథాలను సమీక్షకు గురి చేసింది. ఈ గ్రంథం రాక ముందు, వచ్చిన తరువాత అనే విభజన రేఖ ఏర్పడింది. పలు రాజకీయ పార్టీలు ఉద్యమాలు సంస్థలు పునరాలోచనలో పడి తమను తాము మార్చుకున్నాయి. సామాజిక ఉద్యమకారులు త్యాగాలు ఎవరివి? నాయకత్వం ఎవరిది? అనే ప్రశ్నతో అనేక పార్టీలలో ఉద్యమాలలో రిక్రూట్ మెంట్ ఆగిపోయింది. దాంతో కుల సమస్యను పట్టించుకుని కొన్ని నిర్మాణాలు ఏర్పడ్డాయి. ఒక మాటలో చెప్పాలంటే కమ్యూనిస్టు మ్యానిఫెస్టో, కుల నిర్మూలన గ్రంథాల వలె గతి తర్క తత్వ దర్శన భూమిక పోలరైజేషన్ కు గురి చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎందరినో కదిలించి బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ రచయితల కళాకారుల మేధావుల ఐక్య వేదిక ఏర్పడడానికి దారి తీసింది.




ఆటు తర్వాత దరకమే ఐక్య వేదిక తరపున దళిత సాహిత్య గర్జన, 8 పేజీలు, గురజాడ కన్యాశుల్కం ను ఇప్పుడెలా చూడాలి అనే 8 పేజీలు చిన్న పుస్తకాలు సాహిత్య ప్రకంపనలు సృష్టించాయి. ఆకుల గంగాధర్ రాసిన కవితలతో " దళిత భారతి " కవితా సంపుటి వెలువడింది. దళిత పేరుతో వెలువడిన ఈ కొత్త పుస్తకం తర్వాత చాలామంది దళిత కవిత్వం ధైర్యంగా రాయడానికి ముందుకు వచ్చారు. గతితర్కం, మార్క్సిజం, అంబేద్కరిజం పుస్తకం మూడు దృక్పథాలను తులనాత్మకంగా విశ్లేషించి చూపింది.

సిద్ధాంతం చర్చలతో పాటు హాస్టల్ కథలు, ప్రభాతం నాటిక, కరీంనగర్ జిల్లా దళిపాటలు, వెలువడ్డాయి. అంబేద్కరిజం సోషలిజం అనే పుస్తకాన్ని నిజామాబాద్ లో కాన్షీరాం ఆవిష్కరించారు. ఈ క్రమంలో దరకమే స్ఫూర్తితో కంచె ఐలయ్య వై ఐ యాం నాట్ హిందూ పుస్తకం, నారగోని రచనలు, మాస్టార్జీ పాటలు, వెలువడ్డాయి. ప్రవహించే పాట, ప్రేమ్ అంటే ఏమిటి పుస్తకాలు వెలువడ్డాయి. ఒక మేరకు దళిత పాటల సమగ్ర సంకలనం ఇదే. ప్రేమంటే ఏమిటి పుస్తకం బౌద్ధం, యోగ ధ్యానం, మానవీయ సంబంధాలను విశ్లేషించింది. దీని స్ఫూర్తితో దళిత ప్రేమ కవితల సంకలనం వెలువడింది. విశాల సాహితి 1995నుండి సాహిత్య సభలను నిర్వహించడం ప్రారంభించింది. జాషువా జయంతి సభతో కార్య క్రమాలు మొదలయ్యాయి.

దక్కన్ ఐక్య వేదికకు తోడుగా అనేక కథా శిక్షణ తరగతులు నిర్వహించింది. 1997 లో బి ఎస్ రాములు కథల సంపుటి " స్మృతి" వెలువడింది. కథలబడి కథా అలంకార శాస్త్రం 1998లో వెలువడి వందలాది కథకులు , సమీక్షకులు ఎదగడానికి తోడ్పడింది. మమతలు మానవ సంబంధాలు కథల సంపుటి , ప్రపంచీకరణ లో వేపచెట్టు తెలంగాణ కథలు , పాలు ఇతర కథలు, తేనెటీగలు, బతుకు పయనం కథా సంపుటాలు వెలువడ్డాయి.

1998 లో బి ఎస్ రాములు 50 జన్మ దిన సందర్భంగా పెద్ద ఎత్తున ఒక రోజంతా సాహిత్య సభ జరిగింది. వందలాది రచయితలు సాహితీవేత్తలు హాజరయ్యారు. ఆ సందర్భంగా బి ఎస్ రాములు తల్లి జ్ఞాపకం గా విశాల సాహితి పురస్కారాలు ప్రారంభించారు. అంపశయ్య నవీన్, ఆడెపు లక్ష్మి పతి భూపాల్ మొదలు.. అలా ఏటా ఇస్తూ వందల మందికి పురస్కారాలు అందజేస్తూ వస్తున్నారు. జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, హైదరాబాద్ లలో పలు కార్య క్రమాలు నిర్వహించారు. ఆధునిక కథా సరిత్సాగరం కరీంనగర్ జిల్లా కథలు నాలుగు సంపుటాలు ఇతర జిల్లాల కథాసంకలనాలు రావడానికి ప్రేరణ అయ్యాయి.

2003 లో బహుజన తత్వం పుస్తకం మరోసారి తాత్విక చర్చలను ముందుకు. తెచ్చింది. విశాల సాహితి పాటలు, పిల్లల పాటలు ప్రచురించింది. యాభై ఏళ్ల తెలుగు కథ తీరు తెన్నులు పై సమగ్ర సామాజిక కథ వ్యాస సంపుటి ఆధునిక కథా సాహిత్యంలో తెలంగాణా కథలను, బహుజన కథలను విశ్లేషించింది. భారతీయ సమాజం నేటి రాజకీయ సామాజిక పరిణామాలు, బీసీలు ఏం చేయాలి? బీసీలకు ఏంచేయాలి తదితర పుస్తకాలను పత్రికలలో వచ్చిన వ్యాసాలు సంకలనం తేవడం జరిగింది. 2003 లో హైదరాబాద్ లో ఉస్మానియా యూనివర్సిటీ సమీపంలో శవం చౌరస్తాలో విశాల సాహితి కార్యాలయంఏర్పాచైంగి. ఇది సాహిత్య సామాజిక చర్చలకు, తెలంగాణ ఉద్యమానికి థింక్ టాంక్ గా గొప్ప పాత్ర నిర్వహించింది. తెలంగాణ తల్లి ఈ కార్యాలయంలోనే రూపు దిద్దుకుంది. ఇలా సమాజం చరిత్ర ను మలుపు తిప్పడం లో, సామాజిక సాహిత్య తాత్విక రంగాల్లో విశాల సాహిత్య అకాడమీ తనదైన పాత్రను నిర్వహించింది. ఇప్పటి వరుకు 185 పుస్తకాలు ప్రచురించి చెరగని ముద్ర వేసింది. వట్టికోట ఆళ్వారుస్వామి , కె సి గుర్తు, మున్షీ ప్రేంచంద్ వారసత్వాన్ని అంది పుచ్చుకొని ముందుకు సాగుతున్నది విశాల సాహిత్య అకాడమీ.



## సరస్వతి కెనాల్ నుంచి నీటి విడుదల

**విశ్వంభర, నిర్మల్:** నిర్మల్ జిల్లా సోన్ మండలం గాంధీనగర్ గ్రామం వద్ద శ్రీరామ్ సాగర్ జలాశయం నుండి సరస్వతి కాలువ ద్వారా వానాకాలం పంటకు 500 క్యూసెక్కుల సాగు నీటిని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి విడుదల చేశారు. గంగామాతకు పూజలు చేసి అనంతరం బటన్ నొక్కి నీటి విడుదల చేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వర్షాలు కురవడంతో ఎస్సారెస్పీ నిండుకుందని, రైతులు నీటి కోసం ఎలాంటి ఆందోళన చెందకుండా వ్యవసాయ అధికారులు సూచించిన పంటలు సాగుచేస్తూ ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి :**
**సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్ రావు**



**విశ్వంభర చివ్వేంల:** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట జిల్లా సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని దురాజ్ పల్లిలోని ప్రతిష్ట ఫార్మసీ కళాశాలలో విద్యార్థుల కు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశలో నే విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సైబర్ క్రైమ్ పై ఏర్పాటు చేసిన ఈ సదస్సు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. సైబర్ నేరాలకు గురి కాకుండా ముందుగానే గుర్తిం చాలని, వాట్సాప్ లో వచ్చిన యాప్స్, ఫైల్స్, ఇన్ స్టాల్ చేసుకోకూడదని, లోన్ యాప్ లో లోన్ తీసుకోకూడదని, కరెంట్ బిల్ కట్టాలం టూ వచ్చే మోసపూరిత సందేశాలు నమ్మకూ డదు అని అన్నారు. సైబర్ ఫిర్యాదుకు టోల్ ఫ్రీ నెంబర్ 1930 సంప్రదించాలని, పోలీస్ సహాయం కోసం డయల్ 100 కు సమాచారం అందజేయాలన్నారు. అనంతరం సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్ రెడ్డి మాట్లా డుతూ యువత ఇంటర్నెట్ ను సద్వినియోగం చేసుకోవాలి అని కోరారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు అలవాటు పటి భవిష్యత్తు అందాకారం చేసుకోవద్దు అని కోరారు. యువత ఇతరులకు ఆదర్శంగా ఉండాలని తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి, రాజ్ కుమార్, డీ ఫోర్ సీ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఎస్ఐ2 కనక రత్నం, పోలీస్ సిబ్బంది, కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కామారెడ్డి పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ప్రతి బుధవారం అయ్యప్ప ఆలయ కమిటీ ఆద్వర్యంలో ఓంకారం వేణు, డాక్టర్ శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని అన్నదానం నిర్వహిస్తున్నారు. (విశ్వంభర, కామారెడ్డి)

## రహదారిపై ఆవుల సంచారం

**ఇబ్బందుల్లో వాహనదారులు**



**విశ్వంభర, మెట్‌పల్లి :** మెట్‌పల్లి ప్రధాన రహదారిపై గోవులు సంచరిస్తూ వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి,. ప్రధాన కూడళ్లలో గోవులు గుంపులు గుంపులుగా సేద తీరడం వల్ల పలు వాహనదారులు ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఆవుల యజమానులు స్వేచ్ఛగా వదలడంతో రోడ్లపై తీష్ట వేస్తున్నాయని, అలాగే రోడ్డుపై ద్విచక్ర వాహనాలు పార్క్ చేయడం వల్ల ఇబ్బంది కలుగుతుందని పోలీసు శాఖ దృష్టి సారించి రహదారిపై వాహనాలను నిల్పకుండా చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజలు కోరుచున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వాటి యజమాని ద్వారా గోవులను రోడ్లపై రాకుండా కట్టడి చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## జాతీయ చేనేత దినోత్సవంలో
# పాల్గొన్న కలెక్టర్ రాహుల్ శర్మ



**విశ్వంభర, భూపాలపల్లి:** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత దినోత్సవంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేనేత రంగంలో విశిష్ట కృషి చేసిన చేనేత కార్మికులను జిల్లా కలెక్టర్ శాలువాతో ఘనంగా సత్కరించారు. చేనేత దినోత్సవంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సముపార్జనలో చేనేత ఒక సాధనంగా నిలిచిందని అన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అహింసాయుత ఉద్యమానికి నాంది పలికిన చేనేత రంగానికి ఒక రోజు ఉండాలని ఆగస్ట్ 7ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారత స్వాతంత్ర్య ఉద్యమం జరుగుతున్న సమయంలో విదేశీ వస్త్రాలను బహిష్కరించాలన్న లక్ష్యంతో స్వదేశీ ఉద్యమం వచ్చినట్లు పేర్కొన్నారు. 1905వ సంవత్సరం ఆగస్టు 7న స్వదేశీ వస్తువుల బహిష్కరణపై జరిగిన సమావేశంలో విదేశీ వస్త్రాలు బహిష్కరించడంతో పాటు దేశీయ ఉత్పత్తుల పునరుద్ధరణకు పిలుపునిచ్చారని, అలా విదేశీ వస్తు బహిష్కరణల కీలక రోజైన ఆగస్టు 7వ తేదీనీ జాతీయ చేనేత దినోత్సవంగా ఘనంగా జరుపుకుంటున్నామని ఆయన తెలిపారు. జిల్లాలో మగ్గాలపై బట్టలు నేసే కార్మికులు చాలామంది ఉన్నారని అన్నారు. మహదేవ్ పూర్ మండలంలో దసలి పట్టుతో తయారయ్యే బట్టలు విదేశాలకు ఎగుమతి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు తన దృష్టికి తెచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. తన క్షేత్రస్థాయి పర్యటనల్లో నేత కుటుంబాలను సందర్శిస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ ఖాజా మొయినుద్దీన్, ప్రధాన కార్యదర్శి భీమనాధుని సత్యనారాయణ, టేకుమట్ల చేనేత సహకార సంఘం సొసైటీ ఛైర్మన్ మాచర్ల మహేందర్ పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలి

**విశ్వంభర, జగిత్యాల:** జగిత్యాలలో జర్నలిస్టులు ఇండ్ల స్థలాల సాధన కొరకు నిరసన దీక్ష చేస్తున్నారు. ఇట్టి నిరసన కార్యక్రమానికి కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ దీక్షకు సంఘీభావం ప్రకటించారు. మెట్ పల్లి మాజీ ఎంపీపీ మారు సాయి-ఎరెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలిచే అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు బేషరతుగా మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.




## స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో
# ప్రతి ఒక్కరు పాల్గొనాలి

- మొక్కలను నాటి ఆరోగ్యాన్ని, వాతావరణాన్ని కాపాడుకోవాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**విశ్వంభర, చివ్వేంల :** స్వచ్ఛదనము-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టత్మాకంగా తీసుకొని గ్రామాలలో, పట్టణాలలో దోమల ద్వారా అంటువ్యాధులు ప్రభలకుండా జాగ్రత్తలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని రైతు వేదిక ఆవరణలో మొక్క ని నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీధులు, ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాలు పరిశుభ్రంగా ఉంచుకొవాలని, రోడ్ల మీద గుంటలలో నీరు నిల్వ ఉండి దోమలు చేరుతాయని వాటి ద్వారా డెంగ్యూ, మలేరియా వ్యాధులు వ్యాపిస్తాయి కాబట్టి రోడ్ల మీద గుంటలు రాళ్ళ మిశ్రమంతో పుడ్చాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎక్కడైనా పరిశుభ్రంగా లేకపోయినా, గుంటలు ఉన్న గ్రామ పంచాయతీ వారికి తెలియజేస్తే వెంటనే గుంటలను పూడ్చి పరిసరాలను పరిశుభ్రంగా చేస్తారని కలెక్టర్ ప్రజలకు సూచించారు. మండలంలో రైతు భీమా, పంట నమోదు, రైతు రుణమాఫి గురించి మండల వ్యవసాయ అధికారులతో చర్చించి ఇంకా ఎవరైనా అర్హత ఉండి రుణమాఫి కానీ రైతుల వివరాలను అధికారులకు, బ్యాంక్ అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు కలెక్టర్తో ఉపాధి హామీ కూలీ డబ్బులు జమ అవ్వటంలేదని తెలపగా వెంటనే సమస్యని పరిష్కరిస్తా అని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. తదుపరి గ్రామ పంచాయతీ సిబ్బందితో మాట్లాడి వీధులను పరిశుభ్రంగా ఉంచాలని, మొక్కలను సంరక్షించాలని, జీతాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. బోధకాలు వ్యాధితో బాధపడుతున్న వెంకులు, కరుణమ్మతో మాట్లాడి మండల ప్రాథమిక హాస్పిటల్ కి వెళ్ళి డాక్టర్ తో మాట్లాడి సరైన చికిత్స, మందులు ఇప్పించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జగదీశ్ రెడ్డి, డీ.ఎల్.పీ.ఓ కె. నారాయణ రెడ్డి, ఎంపీడీఓ సంతోష్ కుమార్, మండల వ్యవసాయ అధికారి ఆశ కుమారి, ఏపీఓ నాగయ్య, పంచాయతి కార్యదర్శి కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.



## ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నా బాల బ్రహ్మానంద సరస్వతి

**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో బుదవారం నైమిశారణ్య పీఠాధిపతులు శ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి, శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వారికి దేవస్థానం రాజగోపురం వద్ద దేవస్థానం అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం శ్రీ కాలేశ్వర ముక్తేశ్వర స్వామికి అభిషేకము, శ్రీ పార్వతీ దేవి, మహా సరస్వతి దర్శనం చేసుకున్నారు. అనంతరం శ్రీ పార్వతి అమ్మవారి ఆలయంలో పీఠాధిపతులు వారికి ఆలయ కార్య నిర్వహణ అధికారి ఏ. మారుతి, అర్చక స్వాములు, వేద పండితులు స్వామివారి శేష వస్త్రములు, తీర్థ ప్రసాదములు అందించారు. ఉదయం శ్రీ మహా కాల శివలీల విలాసం ప్రవచనములు పీఠాధిపతులు భక్తులకు వినిపించారు. కార్యక్రమంలో దేవస్థానం కార్య నిర్వహణ అధికారి మారుతి, సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, వేద పండితులు, అర్చక స్వాములు, గ్రామస్తులు, భక్తులు పాల్గొని స్వామివారి ప్రవచనాలను ఆలకించారు. అనంతరం పీఠాధిపతులు భక్తులకు మంగళ శాసనాలు అందజేసి తీర్థ ప్రసాదాలు అందించారు.



## చేనేత వస్త్రాలు ధరించి
# చేనేత కార్మికులకు అండగా ఉందాం

- తెలంగాణ సంస్కృతిలో చేనేత కార్మికులది ప్రత్యేక స్థానం
- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణా తారా

**విశ్వంభర, దోమకొండ:** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణా తారా మాట్లాడుతూ చేనేత వస్త్రాలు ధరించి చేనేత కార్మికులకు అండగా ఉందామని పిలుపునిచ్చారు. తెలంగాణ సంస్కృతిలో చేనేత కార్మికులది ప్రత్యేక స్థానం ఉందని ప్రపంచ స్థాయి వస్త్రాలను నేసిన చరిత్ర మన నేత కార్మికులకు ఉందని అన్నారు. అగ్గి పెట్టెలో పట్టేంత చీరను నేసిన నేత కార్మికులు తెలంగాణలో ఉన్నారని అన్నారు. చేనేత కార్మికులను ఆదుకునేందుకు చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని అన్నారు.



## చేనేత కార్మికులకు సన్మానం

**విశ్వంభర, నార్కట్‌పల్లి :** జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా నార్కట్ పల్లి మండలం అమ్మనబోలు గ్రామంలో మహాత్మా గాంధీకి పూలమాలలు వేసి నివాళీలు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నల్లగొండ జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి రాపోలు గాయత్రి చేనేత కార్మికులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చేనేత మండల కాన్వీనర్ పోచం వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు రాపోలు సంతోష్, మాజీ సర్పంచ్ బద్దం వరమ్మ రాం రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొంపెల్లి సైదులు, చేనేత సంఘం డైరెక్టర్ రాపోలు వెంకటేశం, పెద్దలు కాచం బిక్షమయ్య, పోచం రామలింగయ్య, వనం మార్కొండయ్య, దేవులపల్లి మల్లేశం, ఏలే సోమనాదం, కొక్కుల లక్ష్మమ్మ, కోమటి మణెమ్మ తదితర చేనేత కార్మికులు పాల్గొన్నారు.



# స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**విశ్వంభర, డిండి:** డిండి మండలంలోని తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని ఇంకా మెరుగ్గా నిర్వహించాలని ఎమ్మెల్యే బాలు నాయక్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కార్యక్రమాలను నిర్వహించాలని పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీపడవద్దన్నారు. పిచ్చి మొక్కలు గడ్డి తొలగించాలని అన్ని మురుగు కాలువలను శుభ్రం చేయాలన్నారు. రహదారులపై వర్షపు నీరు నిలువ ఉండకుండా గుంతలన్నీ పూడ్చివేయాలని అధికారులను ఆదేశించారు. పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, సంపాదనలు, రహదారులకు ఇరువైపులా పాఠశాలలో, అన్ని ప్రభుత్వ సంస్థల్లో మొక్కలు నాటి నూరు శాతం లక్ష్యాన్ని చేరాలన్నారు. పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి సరఫరా సంరక్షణపై దృష్టి సారించి ప్రతి జనాభాకు 10 వ్యక్తిగత జోక్స్ ఫీట్లు ఒక కమ్యూనిటీ షో సీట్లను నిర్మించాలన్నారు. గ్రామాలలో ఉన్న మురికి కాలువలను శుభ్రపరచాలన్నారు. కార్యక్రమంలో మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్ రావు, మండల పార్టీ అధ్యక్షులు రాజేష్ రెడ్డి, నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, పీఏసీయస్ చైర్మన్ జాలే నర్సింహా రెడ్డి, బుచ్చిరెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొర్ర రాంసింగ్ నాయక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, మాజీ ఉపసర్పంచ్ నూకం వెంకటేష్, శ్రీనివాస్ గౌడ్, భీముడు, ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, యువకులు, మైనార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన ఆహారం అందించాలి

- సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ రాహుల్ శర్మ



**విశ్వంభర :** గురుకుల పాఠశాలలలో మౌలిక వసతులు కల్పనపై కేజీబీవీ, ఎస్సీ, బీసీ, గిరిజన సంక్షేమ, గురుకుల పాఠశాలలు, వసతి గృహ సంక్షేమ అధికారులతో కలెక్టర్ రాహుల్ శర్మ సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో కేజీబీవీ, ఎస్సీ, బీసీ, జిల్లా అధికారులు, గిరిజన, గురుకుల, మహాత్మా జ్యోతిభా పూలే, మోడల్ పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్స్, వసతి గృహ సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థుల సంఖ్య, గైర్హాజరు శాతం, మౌలిక సౌకర్యాలు కల్పన, సిబ్బంది వివరాలు, మెనూ ప్రకారం భోజనం అందచేయుట తదితర అంశాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని గురుకుల, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన విద్య అందించాలని ఆదేశించారు. ఎస్సీ,11, బీసీ 7, కేజీబీవీలు 11, మోడల్ పాఠశాలలు 5, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల 11, గిరిజన సంక్షేమ 23, మైనార్టీ 9 నిర్వహించబడుతున్నాయని వాటిలో 8795 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు తెలిపారు. అన్ని సంక్షేమ వసతి గృహాలల్లో విద్యుత్ సరఫరా, తరగతి గదుల సంఖ్య, ఆర్.ఓ ప్లాంట్, సోలార్ వాటర్ హీటర్లు ప్రహారీలు, మౌలిక వసతులు, భవనాలు, మంచి నీటి బోర్లు, మిషన్ భగీరథ నల్లా కనెక్షన్, మురుగునీటి నిల్వలు, డ్రైనేజీ సమస్యలు వంటి సమస్యల పరిష్కారానికి ప్రతి ప్రతిపాదనలు ఇవ్వాలని, అట్టి ప్రతిపాదనలు ఆధారంగా ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి అంచనా నివేదికలు తయారు చేయనున్నట్లు ఆయన తెలిపారు. వసతి గృహాలకు సరఫరా చేయు నిత్యావసర సరుకుల్లో నాణ్యత ఉండాలని తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించు విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. వంట చేయు ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆహారాలను తనిఖీ చేయాలని ఎవరైనా విద్యార్థులు జ్వరాలు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతుంటే సంబంధిత వైద్య శాఖ అధికారులకు సమాచారం అందించి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, బీసీ, మైనారిటీ శాఖ అధికారి శైలజ, ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద శంకరంపేటలో భారీ వర్షం



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పెద్ద శంకరంపేటలో బుధవారం ఉదయం నుండి చిరుజల్లులతో కురిసిన వర్షం సాయంత్రానికి ఓ మోస్తారు భారీ వర్షం కురిసింది. పెద్ద శంకరంపేటలోని పాత గ్రామపంచాయతీ వీధిలలో మురికి కాలువలు పొంగిపొర్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోచమ్మ వీధిలో సైతం మురికి కాలువలు పొంగిపొరడంతో అం తర్గత రహదారులపై నీరు పొంగి పొల్లడంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పలు అంతర్గత రహదారులు బురదమయంగా మారా యి. పలువురి గృహాలలోకి మురికి నీరు ప్రవేశించగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతర్గత రహదారులు మొత్తం చిత్తడి చిత్తడిగా మారాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి పెద్ద శంకరంపేటలోని మురికి కాలువలను శుభ్రం చేయడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుతున్నారు.

# టీఎస్‌జేయు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనివాస్



**విశ్వంభర, భూపాలపల్లి:** ఎన్‌యూజే(ఐ) అనుబంధం తెలంగాణ రాష్ట్ర జర్నలిస్ట్ యూనియన్ (టి.ఎస్. జే.యూ) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా భూపాలపల్లికి చెందిన స్టాఫ్ రిపోర్టర్ పావుశెట్టి శ్రీనివాస్‌ను నియమిస్తూ టీఎస్‌జేయూ రాష్ట్ర అధ్యక్షులు మేరుగు చంద్ర మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జర్నలిజానికి చేసిన విశేషమైన కృషికి, వృత్తి విలువలు, సూత్రాలను నిలబెట్టడంలో అచంచలమైన నిబద్ధతకు గుర్తింపుగా ఈ పదవి బాధ్యత్తులు అప్పగిస్తున్నట్లు వారు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పావుశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించినందుకు ఎన్.యు.జె (ఐ )జాతీయ ఉపాధ్యక్షులు నారగాని పురుషోత్తం, టీ.ఎస్.జే.యూ రాష్ట్ర అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు నాగపురి శ్రీనివాస్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జల్డి రమేష్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు ఉదయ్, రాష్ట్ర నాయకులు సత్యంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానని, తెలంగాణలోని జర్నలిస్టులందరికీ మద్దతు ఇచ్చే టీ.ఎస్.జే.యు సంఘాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తానని పావుశెట్టి శ్రీనివాస్ ప్రకటనలో పేర్కొన్నారు.



# ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలి

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** ఉపాధి హామీ పథకంలో ఉన్న పనులను రైతులు ఉపాధి హామీ కూలీలు సద్వినియోగం చేసుకోవాలని పెద్ద శంకరంపేట ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా పేర్కొన్నారు. బుధవారం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని మల్కాపూర్ లో ఉపాధి హామీ పండుగ ద్వారా చేపట్టిన ఫారంపాడు హార్టికల్చర్ ప్లాంటేషన్ తదితర పనులను ఆమె పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో ఉన్న పనుల గురించి రైతులకు, ప్రజలకు సిబ్బంది వివరించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ నవాజుద్దీన్, టీఏ లు రమేష్, స్వప్న, సుభాష్, మోహన్, రైతులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సాయం



**విశ్వంభర, నారాయణపూర్ :** సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన ఓ పేదింటి ఆడబిడ్డ పెళ్లికి మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ చేయూతనందించారు. చిలువేరు సంజీవ, నర్సమ్మ దంపతుల కుమార్తె వివాహానికి 10,000/- రూపాయల మొత్తాన్ని బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో వారి కుటుంబనికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు తెలంగాణ బిక్షం, నాయకులు పాశం కృష్ణ, వడ్డెపల్లి రాములు, సాగర్, రాసాల వెంకటేష్, బాకారం నాగరాజు, శికిలమెట్ల ప్రభాకార్, చిలువేరు వెంకులు, చిలువేరు వెంకటేష్, చిలువేరు జంగయ్య, గుండమల్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆరు నెలల పిల్లల వరకు తల్లిపాలు పట్టించడం శ్రేయస్కరం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం తల్లి పాలు వారోత్సవాలులో భాగంగా అప్పుడే పుట్టిన బిడ్డల నుంచి ఆరు నెలల వచ్చే వరకు తల్లిపాలను తప్పనిసరిగా పట్టించాలని బీఆర్ఎస్ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు సోలిపురం అరుణ ఉపేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని 5వ అంగన్వాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొని మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు వాణి, జానకి, ఆయాలు ఉన్నారు.

# తిమ్మాపురంలో స్వచ్ఛదనం-పచ్చదనం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం తిమ్మాపురం గ్రామంలో 3వ రోజు నిర్వహించిన పచ్చదనం -స్వచ్ఛదనం కార్యక్రమంపై ప్రజలకు సంపూర్ణ అవగాహనా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించుకోవాలని త్రాగునీరు కలుషితం కాకుండా తగిన జాగ్రత్త లు తీసుకోవాలని ప్రజలకు గ్రామంలో ర్యాలీ ద్వారా ప్రజలలో అవగాహన కలిపించారు. నీటి నీల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేసి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. గ్రామంలో పర్యటించి తమ ఇంటిచుట్టు పరిసర ప్రాంతాలలో శుభ్రంగా ఉంచుకోవాలనీ కార్యదర్శి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగపూరి శిరీష, వ్యవసాయ విస్తరణ అధికారినీ సీహెచ్ మనీషా, ఉపాధి హామీ ఏఫ్ఏ నోముల రవీందర్ రెడ్డి, మహిళ సంఘం అధ్యక్షురాలు దాచ శ్రీలత, వీబీకే నోముల సరిత, ఆశా కార్యకర్త రాచమల్ల రజీత, తాజా మాజీ ఉప సర్పంచ్ తోల్పునూరి అంజయ్య గౌడ్, మాజీ వార్డు మెంబర్ బట్టు గంగమ్మ, గ్రామ పంచాయతీ సిబ్బంది కోల మచ్చగిరి, దేవరాజు రాజశేఖర్, వేముల రాములమ్మ, కోల మల్లయ్య గౌడ్, బట్టు బిక్షపతి, గ్రామస్తులు గొడ్డటి ఎల్లయ్య, బొంత మల్లయ్య, బట్టు యాదయ్య, శ్యామల సోమమ్మ, కోస్న లక్ష్మమ్మ, భాగ్యమ్మ, పార్వతమ్మ పాలొన్నారు.

# న్యాయవాద దంపతులపై పోలీసుల దాడిని వ్యతిరేకిస్తూ న్యాయవాదుల నిరసన

## బార్ అసోషియేషన్ ఆద్వర్యంలో విధులను బహిష్కరణ



**విశ్వంభర, ఆమనగల్లు:** సమాజంలో న్యాయం కోసం విధులు నిర్వహిస్తున్న న్యాయవాదులపై పోలీసులు దాడులకు పాల్పడడం అత్యంత దారుణమని ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లెపల్లి జగన్ అన్నారు. బుధవారం ఆమనగల్లు పట్టణంలోని జూనియర్ మెజిస్ట్రేట్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మెజిస్ట్రేట్ ఆవరణలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. జనగామ జిల్లా లో బార్ అసోసియేషన్ సభ్యులు న్యాయవాది గద్దల అమృతరావ్ అతని సతీమణి గద్దల కవిత దంపతులు తమ క్లైంటును కలవడానికి స్థానిక పోలీస్ స్టేషన్కు వెళ్లగా అక్కడ పోలీసులు వారిపై దాడి చేసి కొట్టడం సహించలేని నేరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా విధులను బహిష్కరించినట్లు పేర్కొన్నారు. దాడికి పాల్పడ్డ సంబంధిత పోలీసులపై చర్యలు చేపట్టి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు తీరును మార్చుకోకపోతే న్యాయపరంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ మల్లెపల్లి జగన్, ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు, సీనియర్ న్యాయవాదులు యాదిలాల్, జాయింట్ సెక్రెటరీ రామకృష్ణ, ట్రెజరరీ మధు, లైబ్రరేయన్ శేఖర్ మరియు న్యాయవాదులు కొప్పు కృష్ణ, మల్లేష్, గణేష్, సంతోష్ కుమార్, దేవేందర్, జగన్ గౌడ్, శ్రీనివాస్, మురళి, సర్దార్, శేఖర్, బిక్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# నేటి బాలలే రేపటి పౌరులు

**విశ్వంభర, నారాయణపూర్:** గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అన్ని వసతులతో విద్యను అందించినట్లయితే రేపటి భాధ్యతాయుత పౌరులుగా ఎదిగే అవకాశం ఉంటుందని మల్లారెడ్డి గూడెం గ్రామానికి చెందిన అన్నం మల్లేష్ కురుమ అన్నారు. బుదవారం తన సొంత గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బూట్లు, టై, బెల్టు, పుస్తకాలను తన సొంత ఖర్చులతో అందించారు. పాఠశాలకు కావలసిన అవసరాలకు తప్పకుండా సహకారం అందిస్తానని హామి ఇచ్చారు. పాఠశాల అభివృద్ధికై సర్వ శిక్ష అభియాన్ నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండ పద్మ శ్రీను, జింకల కిరణ్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిరుపేదకు సీఎంఆర్ఎఫ్ సహాయం



**విశ్వంభర, మహబూబాబాద్ :** అనారోగ్యంతో బాధపడుతున్న మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన కొనతం రామనర్సమ్మకు మెరుగైన చికిత్స అందించేందుకు గాను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సీఎంఆర్ఎఫ్ ద్వారా 2,50,000 రూపాయలు మంజూరు చేయించారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తన స్వగ్రామం ఇనుగుర్తికి చెందిన నిరుపేద రామనర్సమ్మ అనారోగ్యానికి గురై నిమ్స్ ఆస్పత్రిలో చేరినట్లు తెలియడంతో వెంటనే స్పందించి సీపీఆర్ఎఫ్ అధికారులకు సిఫార్సు చేసి 2,50,000 లెటర్ ఆఫ్ క్రెడిట్ మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన పత్రాన్ని ఎంపీ రవిచంద్ర తన పీఏ ధనుంజయ్ ద్వారా ఆమె కుమారుడు వెంకటేశ్వర్లుకు అందించారు. అలాగే, ధనుంజయ్ నిమ్స్ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి రామనర్సమ్మకు వెంటనే మెరుగైన వైద్యం అందించాల్సిందిగా కోరారు.



బాగ్ అంబర్ పేట్ డివిజన్లో 16 లక్షల రూపాయలతో నూతనంగా వేనున్న సీసీ రోడ్ పనులను అంబర్పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పద్మ వెంకటరెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ చంద్రమోహన్, ఇతర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. – విశ్వంభర, బాగ్ అంబర్ పేట్

# తెలుగు విశ్వవిద్యాలయం పేరు తొలగించొద్దు: పురుషోత్తం గుప్తా

**విశ్వంభర, ఎల్బీనగర్ :** తెలుగు విశ్వవిద్యాలయం పేరును తొలగించవద్దని రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ మీడియా కమిటీ చైర్మన్ పాపిశెట్టి పురుషోత్తం గుప్తా అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అమరణ నిరాహర దీక్ష చేపట్టి ఆత్మబలిదానం చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించి తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని కాపాడిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరుకు బదులుగా సురవరం యంసాని శ్రీనివాస్ ప్రతాప్ రెడ్డి పేరు పెట్టాలని భావించడం ఎంత వరకు సమంజసమని అన్నారు. సురవరం ప్రతాప్ రెడ్డి జ్ఞాపకార్థంగా ఏదైన కొత్త ప్రాజెక్టుకు వారి పేరు పెట్టి సముచితజి రీతిలో గౌరవించాలని అని అన్నారు. అదే విధంగా



పొట్టి శ్రీరాములు త్యాగాలను భావితరాలకు తెలియజేసే విధంగా పొట్టి శ్రీరాములు పేరు ఉండాలని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్యసభ తరుపున ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



**విశ్వంభర, సరూర్‌నగర్ :** ప్రతీ ఒక్కరు మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని సరూర్ నగర్ సర్కిల్ డిప్యూటి కమీషనర్ సుజాత శ్రీధర్, డివిజన్ కార్పొరేటర్ అకుల శ్రీవాణి పేర్కొన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సరూర్ నగర్ సర్కిల్ పరిధి లోని వెంకటేశ్వర కాలనీలో వారు తులసి, ఉసిరి, గోరింటాకు, గన్నేరు తదితర మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి బావి తరాల వారికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ డీ.డీ. చంద్ర శేకర్, మేనేజర్ సత్యనారాయణ, శానిటేషన్ ఇన్చార్జీ డిప్యూటి డీ.ఇ నీలిమ, కాలనీ ఇన్చార్జి ప్రెసిడెంటు శ్రీనివాసరావు, కోశాధికారి సాయి కిరణ్, మధుసూదన్ రెడ్డి, విజయ్ కుమార్, వెంకట్రావ్, కణకారావు, నవీన్, వెంకట సాయి, బలరాజ్ గుప్తా, సూర్య పాల్గొన్నారు.



# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత : డీసీ సుజాత

**విశ్వంభర, చైతన్యపురి:** పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని డీ.సీ. సుజాత అన్నారు. బుధవారం చైతన్యపురిలోని పండ్ల మార్కెట్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. డీ.సీ. సుజాత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పరిశుభ్రత, మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆగష్టు 5 నుండి 9 వ వరకు 5 రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటడం వల్ల పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. తమ ఇళ్ళలో, పరిసరాల్లో పరిశుభ్రం చేసుకొని స్థలం ఉన్న ప్రతిచోటా మొక్కలు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఏ లు గణేష్ రెడ్డి, రమేష్, నరేష్, శ్రీరాములు, మహేష్, యుబీ.డీ. అజయ్ కుమార్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# న్యాయవాదులపై పోలీసుల దమనకాండ

**విశ్వంభర,హైద్రాబాద్ :** న్యాయవాదులపై పోలీసుల దమనకాండ కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతుందని, జనగామ న్యాయవాదులపై విచక్షణారహితంగా దుర్భాషలాడుతూ దాడి చేసిన పోలీస్ అధికారులపై తక్షణమే చర్యలు తీసు కోవాలని తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ నరసింహారెడ్డి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ విష్ణువర్ధన్ రెడ్డి , బార్ కౌన్సిల్ మెంబర్స్ అనంతసేన్ రెడ్డి, పాలకుర్తి కిరణ్ , జావిద్‌లకు నవ తెలంగాణ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు బండి దీక్షిత్ , పలువురు న్యాయవాదులతో కలిసి వినతి పత్రం అందజేశారు. తక్షణమే చర్యలు తీసుకొనే విధంగా కార్యాచరణ చేస్తామని బార్ కౌన్సిల్ హామీ ఇచ్చారని తెలిపారు.



# డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన



**విశ్వంభర, కోదాడ:** కోడాడ రూరల్ సీఐ రజితా రెడ్డి గుడి బండ ప్రభుత్వ పాఠశాలలో సైబర్ నేరాలపైన, గంజాయి, డ్రగ్స్ మత్తుమందులపై, పోలీసు కళాభృందం తో విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. సీఐ రజితా రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అధ్వర్యంలో సైబర్ నేరాలపై, గంజాయి డ్రగ్స్ మత్తు మందులు, గుట్కాపై పటిష్టంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో, స్కూల్లో కళాశాలలో చదువుకు నే విద్యార్థులు, యువతి యువకులు ఇంటర్నెట్ ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దని, బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డ్ వివరాలు, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలపవద్దని తెలి యజేశారు. ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దని. మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దు అని కోరారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. అలాగే వేధింపులపై 100 కు సమా చారం ఇవ్వాలని తెలిపినారు. వ్యక్తిగత సమాచారం, బ్యాం కు వివరాలు, ఏటీఎం పిన్ నెంబర్లు, సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దన్నారు. వ్యక్తిగత ఫోటోలను డీ.పీ లుగా పెట్టుకోవద్దని చెప్పారు. మొబైల్ యాప్ లలో వచ్చేటు వంటి అనవసరమైన బ్లూ లింకులను క్లిక్ చెయ్యొద్దు అని తెలిపారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దు అన్నా రు. గంజాయి మత్తుమందులకు సంబంధించిన సమా చారం ఎవరికైనా తెలిస్తే తప్పకుండా పోలీస్ వారికి సమా చారం ఇవ్వాలని తెలియజేశారు. ఎస్.ఐ అనిల్ రెడ్డి మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడపవద్దని, ట్రాఫిక్ రూల్స్ ను అతిక్రమించొద్దు అని అన్నారు. యువత లోన్ యాప్ లకు దూరంగా ఉండాలని తెలిపారు. సామాజిక మాధ్యమాలకు రక్షణగా బలమైన పాస్వర్డు పెట్టుకోవాలని అన్నారు. అనంతరం పోలీసు కళబృందం వారు చక్కటి సాంస్కృతిక, పాటలతో విద్యా ర్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మం నందు ప్రభుత్వ పాఠశాల ఇన్చార్జ్ హెడ్మాస్టర్ శ్రీనివా సరావు, పోలీస్ సిబ్బంది కానిస్టేబుల్ వీరప్రసాద్, నరేష్ కళాబృందం ఇంచార్జ్ యల్లయ్య, గోపయ్య, గురులింగం, క్రిష్ణ,చారి, నాగర్జున, విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అన్నా, చెల్లెలుకు ప్రభుత్వ ఉద్యోగాలు



**విశ్వంభర, సూర్యాపేట:** ఎంతో కష్టపడి సంపాదించి చదివిం చినా పిల్లలకు ఉద్యోగాలు రాక బాధపడుతున్న తల్లిదండ్రులను చూస్తుంటాం, కానీ ఆ ఇంట్లో అన్నా చెల్లిలు ఒకే సారి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులతో పాటు బంధువులను ఆనందోత్సవాల్లో ముంచారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన సమ్మెట విజయ్ కుమార్ రేణుక ఎల్లమ్మలకు కుమారుడు రాహుల్ గౌడ్, కుమార్తె ఐశ్వర్యలు ఉన్నారు. తండ్రి ఉన్న కొద్దిపాటి వ్యవసాయం చేస్తూ పాన్ షాప్ నడుపుతుండే వాడు. పిల్లలను కష్టపడి చదివించి విద్యాబుద్ధులు నేర్పించి ఉద్యోగం సాధించాలనే లక్ష్యం నెరవేరడంతో ఆనందం వ్యక్తం చేశారు. కుమారుడు రాహుల్ గౌడ్ సృజన స్కూల్‌లో పది వరకు చదివి ఇంటర్ శ్రీ గాయత్రి, బీటెక్ శ్రీఇందు కళాశాలలో చదువుకొని కోచింగ్ తీసుకొని లైబ్రరీలో చదువుకున్నారు. ఇటీవల నిర్వహించి టీజీపీఎస్సీలో 2023 పరీక్ష రాయగా ఈ నెల 2న ప్రకటించిన ఫలితాల్లో 450 మార్కులకు గాను 345 మార్కులు సాధించి పంచాయితీ రాజ్‌లో ఏఈఈ ఉద్యోగం పొందాడు. కుమార్తె ఐశ్వర్య సృజన స్కూల్ లో పది వరకు చదివి శ్రీ చైతన్యలో ఇంటర్, బీటెక్ సీఎంఆర్‌లో చదువుకుంది. టీజీపీఎస్సీలో 2023 పరీక్ష రాయగా ఈ నెల 2న ప్రకటించిన ఫలితాల్లో 450 మార్కులకు గాను 337 మార్కులు సాధించి పబ్లిక్ హెల్త్‌లో ఏఈఈ ఉద్యోగం పొందింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసి వారికి స్వీట్ తినిపించారు.

# జాతీయ చేనేత దినోత్సవం




**విశ్వంభర, వనస్థలిపురం:** జాతీయ చేనేత దినోత్సవం ఎల్బీనగర్ లో లక్ష్మీ పద్మశాలి టెక్స్టైల్స్ మార్కెట్ గంజి కిషోర్ ఎంఎంసీ అధ్యక్షులు ఆధ్వర్యంలో నిర్వహిం చారు. గజం గోవర్ధన్ మాట్లాడుతూ తెలంగాణలో పదవ చేనేత దినోత్సవం మూడవ తారీకు నుండి పది రోజులు రాష్ట్ర మంతటా జరుపుకోవడం జరుగుతుం దని తెలిపారు. చేనేత కళాకారులకు 365 రోజులు చేతినిండా పని దొరకడం లేదని, కేవలం 165 రోజు లు మాత్రమే పని చేస్తున్నారని అన్నారు. వారికి సరి అయిన జీవనోపాధి గడవటం లేదని, అందుకని ప్రభుత్వ సహకారం ఉండాలని వారు కోరారు. తెలం గాణ కంటే, ఒరిస్సాలో ప్రతి సంవత్సరం వీవర్స్ పెరుగుతా ఉన్నారు. నేను అనేక రకాల మీటింగులలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాను, సెంట్రల్ మినిస్టర్ కు అడ్వైజర్ గా కూడా పనిచేశానని గజం గోవర్ధన్ వివరించారు. కార్యక్రమంలో గంజి కిషోర్, ఎంఎం సి అధ్యక్షులు కోదండ సత్యనారాయణ, చెరుపెల్లి పాం దురంగం, ప్రధాన కార్యదర్శి పెండెం రాజు కోశాధికారి, మిరియాల వెంకటరమణ ఉపాధ్యక్షులు, సభ్యు లు, గుండా గోపి, వక్కల శ్రీధర్, చెరుకు లక్ష్మీపతి, గడ్డం సత్యనారాయణ, హాస్య రాజేశ్వర్, బోడ రత్తమహా రుషి, మంజు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# దేశ మాన, ప్రాణాలు కాపాడుతుంది చేనేత రంగమే

**దేశ మాన,ప్రాణాలు కాపాడుతుంది చేనేత రంగమే...**




**విశ్వంభర,హైద్రాబాద్ :** ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం ప్రధాన కార్యద ర్శి, పద్మశాలి బిజినెస్ నెట్వర్క్ వ్యవస్థాపక అధ్యక్షులు, గంజి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ లో చేనేత ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారా వు విగ్రహం నుండి జలదృశ్యం లోని చేనేత వర్గాల నాయకుడు ఆచార్య కొండా లక్ష్మ ణ్ బాపూజీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించి ఆత్మహత్యల నుండి చేనేత లను కాపాడే భాధ్యత ప్రభుత్వాలదే అని అన్నారు. చేనేత రంగాన్ని జిఎస్టి నుంచి తొలగించి అన్ని రకాల సబ్సిడీలు కల్పించి ప్రతి చేనేత కార్మికుడికి అండగా ఉండాలని అన్నారు. చేనేత కార్మికులుకు ముడి సరుకులను సబ్సిడీల ద్వారా అందించి నేసిన వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఉపాధి కల్పించాలని కోరారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన చేనేత ఇక్కత్ చీరల డిజైన్ లను బడా వస్త్ర వ్యాపారులు కాపీ కొట్టి ప్రింటెడ్ చీరలను తయారు చేసి సొమ్ము చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కత్ డిజైన్లు పేటెంట్ హక్కులు కలిగి ఉన్నప్పటికీ ప్రింటెడ్ చీరలను తయారు చేసి చేనేత రంగాన్ని,కార్మికుల పొట్ట కొడుతున్నారని మండి పడ్డారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని చేనేత రంగాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వెంకట్రాజయ్య, కోడే శ్రీనివాస్ రాజా, రఘు, తిరుమల , గాలి శ్రీనివాస్, బిళ్ళ దీపిక, బొమ్మ ప్రవళిక, దొంతుల ధనంజయ్, పుట్ట రుషికృష్ణ నేత, గోలి శ్రావణ్, ఉడుత నవీన్, గుండు శ్రావణ్, రఘు భావండ్ల, మాదాసు ప్రశాంత్ నేత, కొక్కుల రాజునేత, భోగ జగదీష్ నేత, మునిపల్లి జనార్దన్ నేత, గంజి వంశీ నేత, డా.గోరిట్యాల మమత, గోలి సాన్వీ తదీతరులు పాల్గొన్నారు.



# ఘనంగా రాఘవేంద్ర హెూటల్ ప్రారంభం

**విశ్వంభర, వనస్థలిపురం:** అల్కాపురిలో ఘనంగా రాఘవేంద్ర హెూటల్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చింతల అరుణ సురేందర్ యాదవ్ పాల్గొన్నారు. రాఘవేంద్ర హెూటల్స్ మంచి రుచికరమైన నాణ్యతతో అందించడంలో భాగ్యనగరంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఈ బ్రాంచ్ కూడా మంచి పేరు ప్రఖ్యాతలు తెస్తారని నేను భావిస్తున్నాను అని ఆయన అన్నారు. మేనేజ్మెంట్ ఎం వీరేందర్ మాట్లాడుతూ మా హెూటల్ లోని ప్రత్యేకంగా తెలుగుదనం ఉట్టిపడేలా చక్కటి రుచులతో భోజన వసతులు కలవని హెూటల్ యాజమాన్యం తెలియజేశారు. సామాన్యుడికి అందుబాటులో ఉండే విధంగా తక్కువ ధరలతో భోజనం ఏర్పాట్లు టిఫిన్స్ మా వద్ద కలవని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అనంతరెడ్డి, మాజీ డీపీపీ సుంకర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# రైల్వే శాఖ భూమిలో వెలసిన అక్రమ వెంచర్

**• రైల్వే శాఖ హద్దు రాళ్లను తొలగించి ప్రైవేట్ ఫెన్సింగ్ పోల్స్**

**విశ్వంభర, పెద్దపల్లి :** రెవెన్యూ శివారు మున్సిపల్ పరిధిలో ఎటువంటి అనుమతి లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డీ.టీ.సీ.పీ అప్రూవల్ లేకుండా వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మారుస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడంతో పాటు ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఏకంగా రైల్వే శాఖకు చెందిన హద్దు రాళ్లను తొలగించడమే గాక, అట్టి భూమిని ఆక్రమంచి రైల్వే శాఖ హద్దులో తమ ప్రైవేట్ ఫెన్సింగ్ రాళ్ళను పాతి రియల్ ఎస్టేట్ వెంచర్ ను డెవలప్ చేసి అధిక ధరలకు అమ్ముతున్నారన్న ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇట్టి రియల్ ఎస్టేట్ వెంచర్ పెద్దపల్లి పట్టణంలోని ఓ ప్రైవేట్ చిట్ ఫండ్ కంపెనీ యజమానికి చెందినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అయితే వ్యవసాయ భూమిని కమర్షియల్ ల్యాండ్ గా మార్చి రియల్ ఎస్టేట్ వెంచర్ ఏర్పాటు చేసే ప్రక్రియలో భాగంగా సంబంధిత గ్రామ పంచాయితి / మున్సిపల్ కు కొంత భూమిని హ్యాండ్ ఓవర్ చేయాలి. అయితే సంబంధిత గ్రామ పంచాయితి / మున్సిపల్ కు ఎంత భూమిని కేటాయించారనేది తెలియాల్సి ఉంది. సంబంధిత శాఖల అధికారుల అండదండలతోనే రియల్ ఎస్టేట్ అక్రమ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన రైల్వే శాఖ హద్దు రాళ్లను తొలగించి, భూమిని కబ్జా చేసి ప్రైవేట్ వెంచర్ ఏర్పాటు చేసిన వెంచర్ యాజమాన్యంపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఏవైనా చర్యలు చేపడుతారో? లేదో? వేచి చూడాల్సిందే.



# పోగొట్టుకున్న సెల్ ఫోన్లు అందజేత

**విశ్వంభర, ఎల్బీనగర్:** వివిధ కారణాలతో పోగొట్టుకున్న దొంగలించబడ్డ సెల్ఫోన్లను తిరిగి అందజేసిన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకా రం వివిధ కారణాల రిత్య పోగొట్టుకున్న 20 సెల్ ఫోన్ల ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి వారికి ఇవ్వడం జరిగింది అని ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

విశ్వంభర V3 NEWS

# ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



## ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణ కేంద్రం లోని ఎంపీడీవో కార్యాలయంలో పట్టణ చేనేత సంఘం ఆధ్వర్యంలో చేనేత కార్మికులతో కలిసి జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ శశాంక్, జిల్లా చేనేత సంఘం అడిషన ల్ డైరెక్టర్ ఇందిర హాజరయ్యారు. సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ ప్రభుత్వం తరపున చేనేత కార్మికులకు అందాల్సిన రుణాలు మంజూర య్యేలా చర్యలు తీసుకుంటా మని అన్నారు. చేనేత కార్మికులకు గృహ జ్యోతి పథకంలో ఇండ్లు కేటాయించి ప్రాధాన్యత కల్పిస్తామన్నా రు. పట్టణ కేంద్రంలోని చేనేత భవన నిర్మాణాని కి నిధులు కేటాయిస్తానని అన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజలు ప్రతి సోమవారం చేనేత వస్త్రాలు ధరించేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చేనేతలకు అందే అన్ని పథకాలను అందేలా చూస్తామని అన్నారు. అర్హులైన చేనేత కార్మికుల సమస్యల ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి సుశిందర్రావు, వ్యవసాయ సహాయ సంచాలకు లు సుజాత, ఎమ్మార్వో లలిత, కమిషనర్ వసంత, ఎంపీడీవో కుసుమ మాధురి, చైర్మన్ రాంపాల్, వైస్ చైర్మన్ దుర్గయ్య, పద్మశాలి సంఘం అధ్యక్షులు బాలకృష్ణయ్య, ఉపాధ్యక్షులు శ్రీను, సభ్యులు గుర్రం కేశవులు అవ్వారి శివలింగం, చేనేత సంఘం నాయకులు గాజుల శ్రీను, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు ఎంగలి ప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు జగన్, బాబా, సురేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

### కలెక్టర్ శశాంక



**విశ్వంభర, ఆమనగల్లు :** జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని యజ్ఞంలా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా నిర్వహించి పూర్తి స్థాయిలో విజయవంతమయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన అన్నారు. బుధవారం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కోనాపూర్, ఆమనగల్లు, ఆకు తోటపల్లి గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కుసుమ మాధురి పూలమొక్కను అందచేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు, మహిళలు అధికారులతో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కుసుమ మాధురి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఎంతో బాధ్యతాయుతంగా చేపట్టాలని ఆకాంక్షించారు. అధికారులు పట్టణ వాసులకు అవసరమైన మొక్కలను నర్సరీలో పెంచాలని, అందరితో మొక్కలను నాటించి వాటిని పెరిగి పెద్దవిగా అయ్యేలా చూడాల్సిందిగా సూచించారు. పాటు తడి, పొడి చెత్తను వేర-ువేరుగా వేసి పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ వసంత పట్టణ ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ వసంత ఎమ్మార్వో లలిత ఆర్ ఐ కేశవ్ మున్సిపాలిటీ చైర్మన్ రాంపాల్ వైస్ చైర్మన్ దుర్గయ్య వైస్ మాజీ ఎంపీపీ అనిత విజయ్, కాంగ్రెస్ నాయకులు బాబా, విజయ్ రాథోడ్ ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ముగ్గురు కానిస్టేబుల్‌ల సస్పెన్షన్

### ఉత్తర్వులు జారీచేసిన సూర్యాపేట ఎస్పీ

**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ నందు పని చేస్తున్న కానిస్టేబుల్స్ రాంబాబు, ఎం.బాలకృష్ణ, ఏల్.పూర్ణ చందర్ ముగ్గురు కానిస్టేబుళ్లు ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారు అనే ఆరోపణలపై విచారణ చేసి ముగ్గురిని సస్పెండ్ చేస్తూ సోమవారం జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. సిబ్బంది ఎవరైనా విధులు నిర్వహణలో అక్రమాలకు ఇకపై శాఖాపరంగా కఠిన చర్యలు తప్పవు అని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

# మద్యం మత్తులో కుమారుడిని రోకలి బండతో కొట్టి చంపిన తండ్రి

**విశ్వంభర, పెద్ద శంకరంపేట్:** కుమారుడి మానసిక వైకల్యం భారంగా మారడంతో మద్య మత్తులో తండ్రి కన్న కుమారుడిపై రోకలి బండతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం పెద్ద శంకరంపేట లో చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, పేట ఎస్సై శంకర్ లు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. పెద్ద శంకరంపేట పట్టణంలోని ఇందిరా కాలానికి చెందిన పిరయిల సాయిలు కూలి పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. చిన్న కుమారుడు ప్రదీప్ ( 16) మానసిక అంగవైకల్యంతో ఉండడంతో భరించలేని తండ్రి మద్యం మత్తులో రోకలి బండతో కుమారునిపై దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. పెద్ద కుమారుడు వివాహం కావడంతో పక్కనే జీవనం కొనసాగిస్తున్నారు. మృతుడిని తల్లిదండ్రులు సాయిలు, భూమమ్మలు మానసిక వైకల్యంతో బాధపడుతున్న చిన్న కుమారుడిని పెంచుతున్నారు. బుధవారం ఉదయం తండ్రి కుమారుడుపై రోకలి బండతో దాడి చేయగా 16 సంవత్సరాల ప్రదీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తాత పెంటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేట ఎస్సై శంకర్ తెలిపారు.



మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## విద్యార్థి అదృశ్యం



**విశ్వంభర ఘట్కేసర్:** ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న విద్యార్థి అదృశ్యమైన సంఘటన మేడ్చల్ జిల్లా ఘ-ట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధి ఎదులాబాద్ గ్రామంలో చోటు చేసుకుంది. టీజీఎస్ డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల ఉప్పల్ ఎదులాబాద్ క్రైట్స్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎమ్మెల్టి కోర్సు చదువుతున్న విద్యార్థి దామర వినయ్ (16) ఈ నెల 6 వ తేదిన సాయంత్రం 5 గంటల సమయంలో ఎవ్వరికీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కళాశాల నుండి బయటికి వెళ్ళాడు. తిరిగి రాకపోవడంతో కలశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి అదృశ్యానికి గల కారణాలు తెలియరాలేదు.



## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండలం మేడిగడ్డ తాండ గ్రామ శివారులో శంకర్ కొండ తాండకి చెందిన నేనావత్ రమేష్ తన ట్రాక్టర్ తో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నాడు. శంకర్ కొండతాండ వాగులో ఇసుకను తన ట్రాక్టర్ లో నింపుకొని ఆమనగల్‌లో అమ్మడానికి వస్తున్న అతనిని నమ్మదగిన సమాచారం మేరకు ఆమనగల్ పోలీసులు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆమనగల్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

# బాసాని లక్ష్మణ్‌కు బీఆర్ఎస్ నాయకుల ఘన నివాళి



**విశ్వంభర, అమ్మనబోలు:** బీఆర్ఎస్ నాయకుడు బాసాని లక్ష్మణ్ అకాల మరణం బీఆరెస్ పార్టీకి తీరని లోటు అని మాజీ జడ్పీ చైర్మెన్ శ్రీ బండ నరేందర్ రెడ్డి అన్నారు. ఆయన అమ్మనబోలు గ్రామంలో జరిగిన లక్ష్మణ్ దశదిన కార్యక్రమానికి హాజరై ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో వీ3 న్యూస్ చైర్మన్, విశ్వంభర తెలుగు దినపత్రిక సీఎండీ కాచం సత్యనారాయణ, నల్గొండ గ్రంధాలయ మాజీ చైర్మెన్ రేగట్టె మల్లిఖార్జున్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు బద్దం వరలక్ష్మీ రాంరెడ్డి, కట్టంగూరు సత్తయ్య గౌడ్, జక్క శ్రీనివాస్, కొమ్ము యాదగిరి, బొడిగె భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మనబోలు బీఆరెస్ నాయకులు బాసాని లక్ష్మణ్ కుటుంబానికి 70,000 రూపాయల ఆర్థిక సాయం అందజేశారు.

# తండ్రికి సెలూన్ షాపు.. కుమారునికి ప్రభుత్వ ఉద్యోగం

**సూర్యాపేట :** తండ్రి సెలూన్ షాపు నడిపిస్తూ కుమారునికి ప్రభుత్వం ఉద్యోగం సాధించాలనే తపన నెరవేరింది. జిల్లా కేంద్రానికి పేరూరి రవికుమార్ నాగలక్ష్మిలకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు వినయ్ కుమార్ సృజన స్కూల్‌లో పది వరకు చదివి ఇంటర్మీడియట్ మాతృ శ్రీ కళాశాల, బీటెక్ వరంగల్, ఎంటెక్ జేఎన్‌టీయూహెచ్ హైద్రాబాద్‌లో చదివి టీజీపీఎస్ 2023లో నిర్వహించ ఇ పరీక్ష రాసి ఈ నెల 2న విడుదలైన ఫలితాల్లో 450 మా ర్కులకు 327 మార్కులు సాధించి ఇరిగేషన్ శాఖలో ఏఈ ఈ ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.






## కుంగిపోయిన కళ్యాణ మండపం

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలంలోని రామాలయం పక్కన గల గుట్ట పైన ఉన్న శ్రీ కుసుమ హరినాథ బాబా ఆలయంలోని కళ్యాణ మండపం కుంగిపోయింది. కళ్యాణ మండపం కింద ఉన్న కొండను కొంతకాలం క్రితం తవ్వడం వల్ల మండపం కుంగిపోతూ వస్తోంది. రెండు రోజుల నుంచి కురు-స్తున్న భారీ వర్షాలతో పాటు రాత్రి కురిసిన అతి భారీ వర్షానికి మండపం కిందకు కుంగిపోయింది. మండపం కిందపడే అవకాశం ఉన్నందున కొండ కింద ఉన్న దుకాణాలను ఇండ్లలో ఉన్న నివాసస్తులను అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రెస్క్యూటీమ్ ను, పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. 1938వ సంవత్సరంలో రామదాసు అనే భక్తుడు నిర్మించిన శ్రీ కుసుమ హరినాథ బాబా ఆలయం రామాలయం పక్కనే ఉంది. తదనంతరం కొండ కింద దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో కొండను కొందరు తవ్వుకుంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో కుసుమహరనాథ బాబా ఆలయంతో పాటు మండపం కూడా ప్రమాదకర స్థితిలో ఉంది. ఎప్పుడు కుంగి కింద పడుతుందో తెలియని పరిస్థితి లో ఉంది. కుంగిపోయిన మండపాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఆర్డీఓ దామోదర్ రెవిన్యూ శాఖ అధికారులు పోలీస్ శాఖ అధికారులు పరిశీలించారు.


# విద్య ప్రాముఖ్యతపై ప్రత్యేక శిక్షణ



**విశ్వంభర, కందుకూరు:** మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు కేజీబీవీ స్కూల్లో కేఎల్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "అసలు ఎందుకు చదువుకోవాలి, తల్లిదండ్రుల విలువలు?" అనే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు చదువు ప్రాముఖ్యత, జీవితంలో విజయం సాధించడానికి విద్య ఎంత అవసరమో, విద్యార్థులకు చదువుతో విభిన్న రంగాలలో ఎంతటి అవకాశాలు ఉన్నాయో వివరిస్తూ, వారి కెరీర్ ని ఎలా ప్లాన్ చేసుకోవాలో ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మారెడ్డి తెలియజేశారు. కేఎల్ఆర్ ఫౌండేషన్ గత కొన్ని సంవత్సరాలుగా విద్యా రంగంలో సేవలందిస్తూ, అనేక ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తుంది. ఈ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్ కల్పించాలనే లక్ష్యంతో, చదువుకు ప్రాధాన్యతను తెలియజేయడం జరుగుతుందని కేఎల్ఆర్ లీడ్ ఇండియా ఫౌండేషన్ చైర్మన్ కిచెన్న గారి లక్ష్మారెడ్డి తెలిపారు.

# వర్గీకరణను వ్యతిరేకించే వారు బహుజన వ్యతిరేకులే

**విశ్వంభర, మహాదేవపూర్:** మహాదేవపూర్ మండల కేంద్రం లో అంబేద్కర్ విగ్రహం ముందు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ మాదిగ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈరోజు సుదీర్ఘ పోరాటంలో మం దకృష్ణ మాదిగ 30 సంవత్సరాలు ఎస్సీ, ఎస్టీలలో ఉండే ఉప కులాలు తీవ్రంగా నష్టపోతున్నాయని మూడు దశాబ్దాల నుండి పోరాటం చేస్తే ఆ పోరాట ఫలితమే వర్గీకరణ అని అన్నారు. సుప్రీంకోర్టు సుదీర్ఘ ఆలోచనలు, వాదనలు చేసి ఆ తీర్పు ఇస్తే, ఆ తీర్పును వ్యతిరేకించిన మాయావతి తమ తీరును మార్చుకొని సమన్యాయం కోసం పనిచేసిన అంబేద్కర్, కాన్షిరాంల విధానాన్ని నువ్వు వ్యతిరేకించినట్లు కాదా అని అన్నారు. మీరు అంబేద్కర్ సిద్ధాంతాన్ని తుంగలో తొక్కడం సబబు కాదని నీ కులం జాతావ్ ఒక వర్గమే బాగుపడాలి అనే నినాదం మానుకొని, ఎస్సీల్లో ఉండే అన్ని కులాలకు సమా న్యాయం జరిగే విధంగా ఆలోచన ఉండాలని, అది అంబేద్కర్ విధానం తెలిపారు. ఇలాంటి పద్దది సరైనది కాదని హెచ్చరిస్తున్నామన్నారు. అదేవిధంగా ప్రకాశం, అంబేద్కర్, ఆర్జెడి, నాయకులు తమ తీరును మార్చుకొని అన్ని వర్గాలకు సమ న్యాయం చేరేవరకు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకులు జక్కయ్య మాట్లాడుతూ వర్గీకరణ వ్యతిరేక కుట్రలను ఉపేక్షించేది లేదని అంబేద్కర్ యొక్క ఆలోచన విధానం అమలు చేయాలని ఇలాంటి సంఘటనలు సబబు కాదని తక్షణమే రెండు తెలుగు రాష్ట్రాలు వర్గీకరణలు తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నల్లబుగ ధర్మయ్య, గట్టయ్య, చాకినరపు తారాచంద్, చింతకుంట్ల సదానందం, బెల్లంపల్లి ప్రవీణ్, లింగాల సాగర్, చింతకుంట్ల రాము, లింగాల సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# కేజ్రీవాల్‌ను మళ్లీ అరెస్టు చేయాలనుకుంటున్నారా..?




**విశ్వంభర, న్యూ దిల్లీ :** దిల్లీ సీఎం అరవింద్ కేజీవాల్ను మళ్లీ అరెస్ట్ చేయాలని చూస్తున్నారా అంటూ ఈడీని దిల్లీ హైకోర్టు ప్రశ్నించింది. మద్యం కుంభకోణంలో కేజీవాల్కు ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్ను సవాల్ చేస్తూ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దిల్లీ హైకోర్టులో పిటిషన్ వేసింది. బుధవారం దీనిపై విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నీనా బన్సల్ మాట్లాడుతూ "నేను అయోమయంలో ఉన్నాను. మీరు అసలు ఏమి చేయాలనుకుంటున్నారు. కేజీవాల్ను మళ్లీ అరెస్టు చేయాలనుకుంటున్నారా " అంటూ ప్రశ్నించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం కేసులో కేజీవాల్కు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు జూన్ 20న బెయిల్ మంజూరు చేసింది. కాగా రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన ఉత్తర్వును దిల్లీ హైకోర్టు నిలిపివేసింది. ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ వాదనలను వినే వరకు కేజీవాల్కు కల్పించిన బెయిల్ ఉపశమనంపై మధ్యంతర స్టే విధించిన విషయం తెలిసినదే.




# మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

- మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు
- బీజేపీ కార్యాలయం ముట్టడికి యత్నం

**విశ్వంభర, హైదరాబాద్:** మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను ఇవ్వాల్సిందేనని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఈ రిజర్వేషన్ తీసుకురాకుంటే యావత్ మహిళా లోకం ఆగ్రహాన్ని చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. దీంతో భారీగా మోహరించిన పోలీసులు మహిళా కాంగ్రెస్ కార్యకర్తలను గాంధీ భవన్ వద్ద అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సునీత రావు మాట్లాడుతూ.. నారీ న్యాయ్ హక్కు సాధించే వరకు పోరాటం చేస్తామన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను వెంటనే అమలుచేయాలన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ వచ్చి ఉంటే నారి న్యాయ్ పేరిట ఇప్పటికే 33 శాతం రిజర్వేషన్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చేవాళ్లమని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు అన్ని పార్టీలూ తమ పోరాటానికి మద్దతు తెలపాలన్నారు. పార్టీలకు అతీతంగా పోరాటం చేయాలని కోరారు. హక్కుల కోసం అందరం ఏకమవుదామని ఆమె పిలుపునిచ్చారు.

# రాజ్యసభ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



**విశ్వంభర, న్యూ దిల్లీ :** రాజ్యసభలో ఖాళీ అయిన స్థానాలకు షెడ్యూల్ విడుదల అయింది. ఇటీవల కొందరు రాజ్యసభ సభ్యులు వివిధ కారణాల వల్ల రాజీనామా చేయడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలోనే ఆ ఖాళీలను నింపేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సమాయత్తం అయింది. ఈ క్రమంలోనే 12 స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనుంది. 9 రాష్ట్రాల పరిధిలో ఉన్న 12 స్థానాలకు సంబంధించి పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడికి సంబంధించి తాజాగా అన్ని తేదీలను ప్రకటించింది. అయితే ఇందులో తెలంగాణ నుంచి కూడా ఓ స్థానం ఖాళీగా ఉంది. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సీనియర్ నేత కే కేశవరావు.. రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి కూడా ఉపఎన్నిక జరగనుంది. 9 రాష్ట్రాల్లోని 12 స్థానాలకు సెప్టెంబర్ 3 వ తేదీన ఎన్నికలు జరగనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనున్నట్లు తెలిపింది. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. అయితే రాజ్యసభ సభ్యులుగా ఉన్న 10 మంది ఎంపీలు.. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వివిధ నియోజకవర్గాల నుంచి పోటీ చేసి.. లోక్‌సభకు ఎన్నికయ్యారు. దీంతో ఆ 10 స్థానాలు ఖాళీ అయ్యాయి. వీరికి తోడు తెలంగాణలో రాజ్యసభ ఎంపీగా ఉన్న కే కేశవరావు.. ప్రతిపక్ష బీఆర్ఎస్ నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలోకి మారడంతో తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మరోవైపు.. ఒడిశాకు చెందిన ఓ రాజ్యసభ ఎంపీ కూడా రాజీనామా చేయడంతో మొత్తం ఖాళీల సంఖ్య 12 కు చేరింది. అస్సాం, బీహార్, హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, త్రిపుర రాష్ట్రాల నుంచి 10 మంది రాజ్యసభ సభ్యులు ఈ ఎన్నికల్లో లోక్‌సభకు ఎన్నిక అయ్యారు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వంలో నరేంద్ర మోదీ మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, సర్బానంద సోనోవాల్, జ్యోతిరాదిత్య సింధియాలు అప్పటివరకు రాజ్యసభ సభ్యులుగా ఉండగా.. ఇటీవల ఎన్నికల్లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. దీంతో రాజ్యసభలో ఖాళీలు ఏర్పడ్డాయి. ఇక రాజ్యసభ ఉప ఎన్నికలకు సంబంధించి ఆగస్టు 14 వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుండగా.. ఆగస్టు 21 వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. అస్సాం, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, త్రిపుర రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు ఆగస్టు 26 వ తేదీలోపు.. బీహార్, హర్యానా, రాజస్థాన్, ఒడిశా తెలంగాణ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు ఆగస్టు 27 వ తేదీలోపు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చని తెలిపింది.

# రగులుతున్న బంగ్లాదేశ్

(మొదటి పేజీ తరువాయి)

ప్రాణాలు కోల్పోయారు. అయితే, తాజాగా ఈ నిరసన మాజీ ప్రధాని షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్ నేతలకు మృత్యుపాశంగా తయారైంది. ఆందోళనకారులు అవామీ లీగ్ నేతలను వెంటాడి, వేటాడి ఊచకోత కోస్తున్నారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆ అవామీ లీగ్ నేతల మృతదేహాలు లభ్యమవుతున్నాయి. స్థానిక మీడియా కథనాల ప్రకారం తాజాగా బంగ్లాదేశ్ వ్యాప్తంగా 29 మంది మృతదేహాలను గుర్తించారు. అందులో 20 అవామీ లీగ్ నేతలు ఉన్నట్లు మీడియా వెల్లడించింది. సాతి▯రా ప్రాంతంలో 10 మంది, కొమిల్లాలో 11 మంది దాడుల్లో ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. అశోక్తలాలో ఒక మూక మాజీ కౌన్సిలర్ ఎండీ షా ఆలం ఇంటికి నిప్పుపెట్టినట్లు తెలిపింది. ఇందులో ఐదుగురు టీనేజర్లతో పాటు మొత్తం ఆరుగురు సజీవదహనమయినట్లు తెలుస్తోంది. నటోరె ప్రాంతంలో ఆందోళన కారులు ఒక ఎంపీ ఇంటికి నిప్పుపెట్టారు. ఆ ఇంట్లోని పలు గదులు, బాల్కనీలు, పైభాగంలో తాజాగా మృతదేహాలు లభ్యమైనట్లు స్థానిక మీడియా పేర్కొంది.

### సినీనటుడి హత్య

ఆదివారం నుంచి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన ఆందోళనకారులు అవామీ లీగ్ పార్టీతో సంబధాలున్నవారిపై దాడులకు తెగబడుతున్నారు. వెంటాడి మరీ వారిని ఊచకోత కోశారు. సోమవారం సైతం ఈ దాడులు కొసాగాయి. షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేశారని తెలియగానే, నిరసన కారులు ఆమె మద్దతుదారలపై దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనల్లో యువ నటుడు శాంతో, దర్శకుడైన అతడి తండ్రిని నిరసనకారులు అతికిరాతకంగా చంపారు. నిరసనకారులు వీరిని చుట్టుముట్టి కర్రలతో కొట్టి చంపినట్లు స్థానిక పోలీసులు ధ్రువీకరించారు. ఈ నటుడు గతంలో హసీనా తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్ బయోపిక్‌లో నటించారు.

### 24 మంది సజీవ దహనం

బంగ్లాదేశీ జానపద గాయకుడు రాహుల్ ఆనందోకు చెందిన నివాసానికి ఆందోళనకారులు నిప్పు పెట్టారు. నిరసనకారులు దాడి చేయగానే రాహుల్ కుటుంబం అక్కడి నుంచి పారిపోవడంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రస్తుతం వారు రహస్య ప్రాంతంలో తలదాచుకున్నట్లు తెలుస్తోంది. జషోర్ జిల్లాలో అవామీలీగ్ నేతకు చెందిన హొటల్‌కు అల్లరిమూకలు నిప్పుపెట్టాయి. ఈ ఘటనలో 24 మంది సజీవ దహనమయ్యారు. మూడు వారాల ఆందోళనల్లో ఇప్పటి వరకు 440 మంది ప్రాణాలు కోల్పోయారు. సోమవారం ఒక్కరోజే 109 మంది మృతి



చెందినట్లు స్థానిక మీడియా వెల్లడించింది.

### తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా యూనస్

రాజకీయ సంక్షోభం తలెత్తిన బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వానికి నోబెల్ శాంతి పురస్కార గ్రహీత మహమ్మద్ యూనస్ నేతృత్వం వహించనున్నారు. అధ్యక్షుడు మొహమ్మద్ షహబుద్దీన్ – నోబెల్ గ్రహీత యూనస్‌ను సారథిగా నియమిస్తున్నట్లు మంగళవారం అర్ధరాత్రి సమయంలో ప్రకటన వెలువరించారు.

### 'ఇంకొన్ని రోజులు దిల్లీలోనే హసీనా

ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసి భారత్‌కు చేరుకున్న షేక్ హసీనా ఇంకొంత కాలం భారత్‌లోనే ఉండనున్నారు. ఈ విషయాన్ని స్వయంగా ఆమె కుమారుడు సజీబ్ వాజెద్ జాయ్ బుధవారం వెల్లడించారు. జర్మనీ ప్రభుత్వ మీడియా సంస్థ డాయిష్ వెల్లేకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. 'ప్రస్తుతం హసీనా ఏదైనా దేశంలో ఆశ్రయం పొందే ఆలోచన చేయడం లేదు. ఇంకొన్ని రోజులు ఆమె దిల్లీలోనే ఉంటారు. హసీనా ఒంటరిగా లేరు. ఆమె సోదరి రేహానా కూడా దిల్లీలోనే ఉన్నారు. బంగ్లాదేశ్, భారత్ మినహా మరో మూడో దేశానికి హసీనా వెళ్లిపోతారనేవి ఊహాగానాలు మాత్రమే' అని సజీబ్ తేల్చి చెప్పారు. హసీనా సోదరి రేహానా లేదా మరెవరైనా కుటుంబ సభ్యులు రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉందా అని ఇంటర్వ్యూలో సజీబ్‌ను ప్రశ్నించారు. 'మా కుటుంబానికి వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో తిరుగుబాటు జరగడం ఇది మూడోసారి. అందుకే హసీనా మినహా ఆమె కుటుంబ సభ్యులంతా విదేశాల్లోనే స్థిరపడ్డారు' అని బదులిచ్చారు.

### హసీనా కుమార్తె కూడా దిల్లీలోనే!

ప్రస్తుతం షేక్ హసీనా కుమార్తె సల్మా వాజెద్ కూడా దిల్లీలోనే ఉన్నారు. ఆమె ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ హెచ్‌వో) ఆగ్నేయాసియా రీజియనల్ డైరెక్టర్ హోదాలో సేవలు అందిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ హెచ్‌వో) ఆగ్నేయాసియా విభాగం కార్యాలయం మన దేశ రాజధానిలోనే ఉంది. షేక్ హసీనా సోదరి షేక్ రేహానా కుమార్తె తులీప్ సిద్దిఖీ ప్రస్తుతం బ్రిటీష్ పార్లమెంట్ సభ్య రాలిగా ఉన్నారు. హసీనాకు యూకేలో ఆశ్రయం కల్పిం చాలని తులీప్ సిద్దిఖీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. హసీనాకు ఆశ్రయం కల్పించేందుకు యూకే ప్రభుత్వం నిరాకరించింది.

### బంగ్లా పరిస్థితులు భారత్‌కు ఓ గుణపాఠం

నియంతృత్వ పాలన ఎక్కువ కాలం కొనసాగదని కశ్మీర్‌కు చెందిన పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) చీఫ్ మెహబూబా ముఫ్తీ అన్నారు. బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిణామాలు భారత్‌లోని పాలకులకు ఒక పాఠం లాంటివని ఆమె కామెంట్ చేశారు. 'యువతను అణచివేస్తే తిరుగుబాటు తప్పక వస్తుంది. ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయకుండా, నిరుద్యోగ సమస్యను పరిష్కరించకుండా, ప్రజలను విద్యకు దూరం చేసేలా విధానాలను అవలంభిస్తే బంగ్లాదేశ్ తరహా పరిస్థితులు కశ్మీర్‌లోనూ తలెత్తుతాయి. నిరంకుశ చట్టాలతో పాలన సాగిస్తున్నప్పుడు ప్రజలు తప్పక తిరగబడతారు. అలాంటప్పుడు షేక్ హసీనా ఎదుర్కొన్న చేదు అనుభవాన్నే భారత పాలకులూ ఎదుర్కోవాల్సి వస్తుంది. బంగ్లాదేశ్ తరహా పరిస్థితులు కశ్మీర్‌లో ఉన్నాయి. యూఏపీఏ, పీఎస్ఏ లాంటి చట్టాలతో కశ్మీరీ యువత విసిగివేసారిపోయారు. బంగ్లాదేశ్ తరహా తిరుగుబాటు కశ్మీర్‌లో జరగకూడదని నేను కోరుకుంటున్నాను' అని ముఫ్తీ తెలిపారు.

### భారత్-బంగ్లా వాణిజ్యం త్వరలోనే పూర్వస్థితికి!

బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం రాజకీయ సంక్షోభం నెలకొనడం వల్ల ప్రతిష్ఠంభన నెలకొంది. అయినప్పటికీ అతి త్వరలోనే బంగాల్‌లోని సరిహద్దు చెక్‌పోస్టుల మీదుగా బంగ్లాదేశ్‌కు వాణిజ్యం పూర్వస్థితికి చేరుకుంటుందని అధికార వర్గాలు వెల్లడించాయి. బంగాల్ సరిహద్దు నుంచి బంగ్లాదేశ్ వరకు ఉన్న చెక్‌పోస్టుల మధ్య సరుకు రవాణాకు ఆటంకం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు ఇరుదేశాల ఉన్నతాధికారులు బుధవారం భేటీ కానున్నారు. మన దేశంలోనే అతిపెద్ద సరిహద్దు చెక్ పాయింట్ 'పెట్రా పోల్' బంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఉంది. ఇరుదేశాల ఉన్నతాధికారులు 'పెట్రా పోల్'లో సమావేశం అవుతారు.

# ఒకరోజు నా స్థానంలో కూర్చోండి

## ఒత్తిడి ఎలా ఉంటుందో తెలుస్తుంది

### న్యాయవాదిపై జస్టిస్ చంద్రచూడ్ అసహనం



**విశ్వంభర, న్యూదిల్లీ :** దేశంలోని కోర్టులు, న్యాయమూర్తులపై ఎంత ఒత్తిడి ఉందో అర్థం చేసుకోవాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. ఒక్కరోజు తన స్థానంలో కూర్చుంటే, మరోసారి జీవితంలో ఆ స్థానానికి రాకుండా పారిపోతారని స్పష్టంచేశారు. ముంబయి చెంబూర్ కాలేజీలో విద్యార్థులకు బురఖా, హిజాబ్‌ను రద్దుచేసిన వ్యవహారంపై దాఖలైన పిటిషన్ విచారణకు వచ్చినపుడు జస్టిస్ చంద్రచూడ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతి న్యాయవాది తమ కేసునే మొదట విచారణ జరపాలంటూ కోరడం పట్ల సీజేఐ అసహనం వ్యక్తం చేశారు. అంతా తమ పిటిషన్ ముందుగా విచారణకు రావాలని కోరుతున్నారని, కానీ తమపై ఉన్న ఒత్తిడిని మాత్రం అర్థం చేసుకోవడంలేదని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. ప్రతి ఒక్క పిటిషన్‌పై తాము విచారణ జరుపుతామని, అందుకు ఒక తేదీ ఇస్తామన్నారు. న్యాయమూర్తులను, కోర్టును శాసించే పరిస్థితులు సరికాదని సీజేఐ స్పష్టంచేశారు.



# దేశ వనరులు వృథా చేస్తున్నారు

### బాంగ్లాదేశ్ అల్లర్లపై మాజీ ప్రధాని ఖలీదా జియా ఆవేదన

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలపై ఆ దేశ నేషనలిస్ట్ పార్టీ అధినేత్రి, మాజీ ప్రధాని ఖలీదా జియా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం గృహనిర్బంధం నుంచి విడుదలైన ఖలీదాజియా బంగ్లాదేశ్ ఖిలాఫత్ మజ్లీస్ ప్రధాన కార్యదర్శితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దేశ వనరులు వృథా అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసినట్లు మీడియా కథనాలు వెలువడ్డాయి. ఈ దేశం తమదని, దాన్ని నిర్మించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజల ప్రాణాలకు హాని తలపెట్టడమే కాకుండా ఆస్తులను ధ్వంసం చేయటం తీవ్రమైన విషయమని ఖలీదాజియా పేర్కొన్నారు.

### 'మా అమ్మ ఎక్కడా ఆశ్రయం కోరలేదు'

మరోవైపు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఏ దేశంలోను ఆశ్రయం కోరలేదని ఆమె తనయుడు సాజీబ్ వాజెద్ వెల్లడించారు. అమెరికా ప్రభుత్వం ఆమె వీసాను రద్దు చేసిందంటూ మీడియా కథనాలు వెలువడిన తరుణంలో ఆయన నుంచి ఈ మేరకు స్పందన వచ్చింది. హసీనా ఆశ్రయం విషయంలో యూకే, యూఎస్ ప్రభుత్వాలు స్పందించడం లేదనే వార్తల్లో ఎలాంటి నిజం లేదని సాజీబ్ వాజెద్ పేర్కొన్నారు. అలాగే అమెరికాతో ఎలాంటి చర్చలు జరగలేదని తెలిపారు.

### భారత్‌లోనే ఆశ్రయం

ఇదిలా ఉండగా షేక్ హసీనా మరో రెండురోజులపాటైనా భారత్‌లోనే ఆశ్రయం పొందడం అనివార్యమయ్యేలా ఉంది. వాస్తవంగా మన దేశం మీదుగా బ్రిటన్‌కు వెళ్లి అక్కడ తాత్కాలిక ఆశ్రయం పొందాలనేది షేక్ హసీనా ఉద్దేశం. ఇదే విషయాన్ని హిండన్ వైమానిక స్థావరంలో దిగడానికి ముందు ఆమె సన్నిహిత వర్గాలు భారత ప్రభుత్వానికి తెలిపాయి.


# వయనాడ్ విషాదం జాతీయ విపత్తుగా ప్రకటించాలి : రాహుల్



**విశ్వంభర, న్యూ దిల్లీ :** కేరళలోని వయనాడ్ జిల్లాలో వరద ప్రభావంతో కొండచరియలు విరిగిపడిన ఘటన దేశవ్యాప్తంగా సంచనలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘోర విపత్తులో ఇప్పటివరకు 400లకు పైగా మృతి చెందారు. 150 మంది ఆచుకీ తెలియకుండా పోయింది. అయితే ఈ ఘటనపై విపక్ష నేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విపత్తును కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరారు. బుధవారం లోక్‌సభలో జీరో అవర్‌లో మాట్లాడిన ఆయన.. కొండచరియలు విరిగిన ప్రాంతాలను సందర్శించానని తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయని.. బాధితులల్లో కుటుంబంలో సభ్యులందరినీ కోల్పోయి ఒంటరిగా మిగిలినవారు కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఇలాంటి సందర్భాల్లో కేంద్రం బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని.. ఈ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరారు. అలాగే వారికి ఇచ్చే పరిహారాన్ని పెంచి.. సమగ్ర పునరావాసాన్ని కల్పించాలన్నారు..

# వారంలో ఒక రోజైనా చేనేత దుస్తులు ధరించాలి

**ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్**



**విశ్వంభర, అమరావతి :** ఆగస్టు 7 ప్రపంచ చేనేత దినోత్సవం సందర్భంగా జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. సునిశితమైన హస్త కళలకు భారతదేశం పుట్టినిల్లు అని పేర్కొన్నారు. అటువంటి కళలలో చేనేత ముఖ్యమైనదని తెలిపారు. అగ్గిపెట్టెలో పట్టేంత చీరను మన నేత కళాకారులు రూపొందిస్తే, ఆ గొప్పదనం చూసి ప్రపంచం అబ్బురపడిందని పవన్ కల్యాణ్ వివరించారు. నేడు ప్రపంచ చేనేత దినోత్సవం జరుపుకుంటున్న ఈ శుభ సమయాన, ఈ రంగంలో ఉన్న ప్రతి ఒక్కరికీ తన తరఫున, జనసేన పార్టీ తరఫున శుభాకాంక్షలు తెలుపుతున్నాను అంటూ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. "ఆధునిక కాలంలో చేనేత కళ కాస్తంత మసకబారింది. చేనేతకు పూర్వవైభవం తీసుకువరావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రజలు సైతం తమ వంతు సహకారం అందించాలి. ప్రజలంతా తప్పనసరిగా వారంలో ఒక రోజైనా చేనేత దుస్తులను ధరించాలి. ఘన చారిత్రక నేపథ్యం ఉన్న చేనేతకు బ్రాండ్ అంబాసిడర్‌గా నన్ను నేను అంకితం చేసుకోవడం అదృష్టంగా భావిస్తాను. ఈ కళనే నమ్ముకుని, ఈ కళను సజీవంగా నిలుపుతూ జీవిస్తున్న చేనేత కుటుంబాలకు ప్రభుత్వాలు ఎల్లవేళలా అండగా నిలబడాలని కోరుకుంటున్నాను" అంటూ పవన్ తన ప్రకటనలో తెలిపారు.




# చేనేత దినోత్సవం సందర్భంగా ప్రధానికి టీడీపీ ఎంపీ అపురూప కానుక

**విశ్వంభర, న్యూఢిల్లీ :** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీకి టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఓ అపురూప కానుకను అందజేశారు. ప్రధానిగా హ్యాట్రిక్ విజయం సాధించిన మోదీ చిత్రాన్ని ఓ చేనేత కుటుంబానికి చెందిన దంపతులతో ప్రత్యేకంగా నేయించారు. ఈ కానుకను ప్రధానికి ఎంపీ అప్పలనాయుడు స్వయంగా అందజేశారు. ఎంపీ అప్పలనాయుడు సూచన మేరకు ఈ చిత్రాన్ని విజయనగరంలోని ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం లావేరు మండలానికి చెందిన బాసిన నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులు సుమారు 40 రోజుల పాటు శ్రమించి ఈ వస్త్రాన్ని పూర్తి చేశారు. మూడు అడుగుల వెడల్పు, ఆరు అడుగుల పొడవు కలిగిన చేనేత వస్త్రంపై మోదీ చిత్రాన్ని ఆ దంపతులు తీర్చిదిద్దారు. బుధవారం స్వయంగా ఎంపీ అప్పలనాయుడు ప్రధాని మోదీకి ఈ చిత్రపటాన్ని అందజేయగా ఆయన చాలా సంతోషం వ్యక్తం చేసి ధన్యవాదాలు తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం రోజున ఈ కానుక అందుకోవడం ఓ తీయని జ్ఞాపకంగా భావిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. 40 రోజులపాటు శ్రమించి ఈ వస్త్రాన్ని రూపొందించిన బాసిన నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులను ప్రధాని మోదీ అభినందించారని ఎంపీ అప్పలనాయుడు తెలిపారు. అంతేకాకుండా పీవీజీ రాజు జీవిత చరిత్ర పుస్తకాన్ని కూడా మోదీకి అందజేసినట్లు ఎంపీ అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు గురించి మోదీ అడిగారని తెలిపారు. అశోక్ గజపతి రాజు ఎలా ఉన్నారు? ఆయన ఆరోగ్యం ఎలా ఉంది? అని ఆరా తీశారని ఎంపీ కలిశెట్టి తెలిపారు. అశోక్ గజపతిరాజుని అడిగానని చెప్పాలని ఆయన్ని ఒకసారి రావాలని చెప్పమని మోదీ సూచించారు. అలాగే మోదీకి పంచే కండువాతో కూడిన చేనేత వస్త్రాలను ఎంపీ అప్పలనాయుడు అందజేశారు.

# మాజీ సీఎం జగన్ బుల్లెట్‌ప్రూఫ్ వాహనాన్ని రీప్లేస్ చేస్తాం




**విశ్వంభర, అమరావతి :** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి బుల్లెట్ ప్రూఫ్ వాహనం రీప్లేస్ చేస్తామని ఏపీ ప్రభుత్వం తెలిపింది. తనకు భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ వైఎస్ జగన్ వేసిన పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో బుధవారం (ఆగస్టు 7) విచారణ జరిగింది. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌కు ఉన్న బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని రీప్లేస్ చేస్తామని న్యాయస్థానికి రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. కండిషన్‌లో ఉన్న బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్నే ఆయనకు కేటాయిస్తామని వివరణ ఇచ్చింది. జగన్ భద్రతా సిబ్బంది సమాచారం ఇస్తే జామర్ వెయికిల్ ఇస్తామని తెలిపింది. ఈ అంశంపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ 3 వారాలకు వాయిదా వేసింది. వైఎస్ జగన్ బుల్లెట్ ప్రూఫ్ వాహనానికి రిపేర్ వచ్చిన సంగతి తెలిసిందే. తన భద్రతపై వైఎస్ జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ బుల్లెట్ ప్రూఫ్ వాహనానికి రిపేర్ చేయించేంతవరకు జగన్ భద్రతకు ప్రమాదంలేకుండా కొత్త బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని ఇస్తామని హైకోర్టుకు ఏపీ ప్రభుత్వం తెలిపింది.

# ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద

**70 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల**
**పరవళ్లను తిలకించిన చంద్రబాబు**



**విశ్వంభర, విజయవాడ :** విజయవాడ ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద పోటెత్తుతోంది. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల జలాశయాల గేట్లు ఎత్తివేయడంతో ప్రకాశం బ్యారేజీకి వరద పోటెత్తింది. బ్యారేజీలోని మొత్తం 70 గేట్లు ఎత్తి 73,227 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. కాల్వల ద్వారా మరో 13,477 క్యూసెక్కుల వదిలారు. బుధవారం సాయంత్రం లేదా రాత్రికి లక్షన్నర క్యూసెక్కులకు వరద చేరుకునే అవకాశముందని అధికారులు అంచనా వేశారు. బ్యారేజీ గేట్లు ఎత్తిన నేపథ్యంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తున్నారు. దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. అధికారులు ఎప్పటికప్పుడూ వరద నీటిని అంచనా వేస్తూ ప్రజలకు పలు సూచనలు చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో రాత్రి కురిసిన భారీ వర్షం కురిసింది. దీంతో విజయవాడలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. తిరువూరు నియోజకవర్గంలో కట్లేరు, ఎదుళ్లవాగులు, విప్ల, పడమటి, గుర్రపు, కొండ వాగులు పొంగిపొర్లాయి. రహదారులపై నీరు రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పులిచింతల ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రాజెక్టులో 157.48 అడుగుల్లో 22.75 టీఎంసీలను నిల్వ చేస్తూ దిగువకు 1,08,895 క్యూసెక్కులను వదిలారు. నాగార్జున సాగర్ నుంచి కుడి, ఎడమ కాల్వలకు నీరు వదిలారు. శ్రీశైలం ప్రాజెక్టులోకి 3.71 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా 883.2 అడుగుల్లో 205.66 టీఎంసీలు నిల్వ చేస్తున్నారు.



**తిలకించిన చంద్రబాబు**

విజయవాడలో చేనేత దినోత్సవాన్ని ముగించుకుని ఉండవల్లి వెళ్తున్న సీఎం చంద్రబాబు ప్రకాశం బ్యారేజీ పై కాన్వాయ్ ఆపి కిందకు దిగారు. వరద ప్రవాహాన్ని చూసేందుకు బ్యారేజీ వద్దకు వచ్చిన సందర్శకులను దగ్గరకు పిలిచి సీఎం వారితో మాట్లాడారు. ఈ క్రమంలో కృష్ణమ్మకు జలకళ ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. నీటి ప్రవాహాన్ని చూస్తుంటే ఎంతో సంతృప్తిగా ఉందని సీఎం చంద్రబాబు సంతోషాన్ని వ్యక్తం చేశారు.
ఈ క్రమంలో సీఎం చంద్రబాబు రాష్ట్రంలో ప్రాజెక్టుల్లో నీటి ప్రవాహాల పై తాజా పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.



# జగన్‌పై అక్రమాస్తుల కేసులపై విచారణ

**సీబీఐపై సుప్రీంకోర్టు అసహనం**

**విశ్వంభర, అమరావతి :** మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం చోటుచేసు కుంది. జగన్ అక్రమాస్తుల కేసులపై ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వ ంలోని ధర్మాసనం%ా% సీబీఐపై అసహనం వ్యక్తం చేసింది. జగన్‌పై నమోద్కెన కేసుల ను తెలంగాణ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని, ఆయన బెయిల్ రద్దు చేసి విచారణ వేగవంతం చేయాలంటూ రఘురామ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన సుప్రీం మే 2న సీబీఐ దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని జస్టిస్ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. ఆరుగురు జడ్జిలు మారి పోవడంతో పాటు రిట్కెర్ కూడా అయ్యారని రఘురామ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కోర్టు ఇచ్చిన ఆదేశాలు తప్పంటూ కాలయాపన చేస్తున్నారని జస్టిస్ సంజీవ్ ఖన్నా అసహనం వ్యక్తం చేశారు. దీనికి, ట్రయల్‌కి సంబంధం లేదని వ్యాఖ్యానించారు. డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తున్నారని, ట్రయల్ ముందుకు సాగకుండా ఇది అడ్డంకిగా మారుతోందని సుప్రీంకోర్టుకు సీబీఐ తెలిపింది. సుప్రీంకోర్టులో తాము కూడా అనేక పిటిషన్లు విచారించి డిశ్చార్జ్ చేస్తున్నామని, తమకు ఎలాంటి అడ్డంకి రావడం లేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. సీబీఐ తరపున వాదనలు వినిపించేందుకు అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) రాజు అందుబాటులో లేరని ఇతర న్యాయవాదులు న్యాయమూర్తికి తెలిపారు.

ఇలాంటి కేసుల విచారణలో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ట్రయల్ చేపట్టాలని, ఇప్పటికే మార్గదర్శకాలు ఉన్నందున వాటిని అనుసరించాల్సిందేనని జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పష్టంచేశారు.



# తెలంగాణ డ్రైవర్లూ...

- ఏపీ వారిపై కాస్త మానవత్వం చూపండి
- పవన్ కల్యాణ్ విజ్ఞప్తి

**విశ్వంభర, అమరావతి :** తెలంగాణ డ్రైవర్లూ... ఏపీ వారిపై మానవత్వం చూపండని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి రాజధాని గడువు తీరగానే హైదరాబాద్‌లో ఉండకూడదంటూ తెలంగాణవారు అడ్డుకుంటున్నట్లుగా తెలిసిందని, ఇది సరికాదన్నారు. ఇది రెండువేల కుటుంబాలకు సంబంధించిన అంశమన్నారు. ఏపీలో రాజధాని పనులు ప్రారంభం కాగానే ఇక్కడి డ్రైవర్లకు ఉపాధి మెరుగవుతుందని ఆకాంక్షించారు. అప్పటి వరకు సాటి ఏపీ డ్రైవర్లపై మానవతా దృక్పథంతో చూడాలని విజ్ఞప్తి చేశారు. పవన్ కల్యాణ్ మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. ఆలిండియా పర్మిట్‌తో తెలంగాణ తాత్కాలిక పర్మిట్ తీసుకొని క్యాబ్‌లు నడుపుతున్న తమను తెలంగాణ డ్రైవర్లు అడ్డుకుంటున్నారని పలువురు ఏపీ డ్రైవర్లు జనసేనాని దృష్టికి తీసుకువెళ్లారు. జూన్ 2తో ఉమ్మడి రాజధాని గడువు ముగిసిందంటూ ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి అర్జీని స్వీకరించిన పవన్ కల్యాణ్... తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. పవన్‌కు అర్జీ ఇచ్చిన అనంతరం ఓ క్యాబ్ డ్రైవర్ మాట్లాడుతూ... ఏపీ క్యాబ్ కనిపిస్తే తగలుబెట్టండని హైదరాబాద్‌లో అంటున్నారని, ఇందుకు సంబంధించిన వీడియో క్లిప్స్‌ను శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చామని చెప్పారు. ఏపీకి చెందిన ఓ క్యాబ్ డ్రైవర్‌పై మ్యాన్ హ్యాండ్లింగ్ చేశారని, ఇందుకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీ ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి న్యాయం చేస్తానని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారన్నారు. అమరావతి అభివృద్ధి జరిగితే తెలంగాణ వారికి కూడా ప్రయోజనం కలుగుతుంది కాబట్టి కాస్త ఓపిక పట్టాలని తెలంగాణవారికి ఆయన విజ్ఞప్తి చేశారన్నారు. పవన్ కల్యాణ్ సానుకూలంగా స్పందించారన్నారు.

# ఉద్యోగులు సమయపాలన పాటించాలి

**హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో అన్ని విభాగాల కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆయా విభాగాలలో ప్రతి సెక్షన్ లో తిరిగి విధులకు హాజరైన ఉద్యోగులను పరిశీలించారు. పలు విభాగాలలో ఉద్యోగులు నిర్దిష్ట సమయంలో కాకుండా ఆలస్యంగా వస్తున్నట్లు గమనించారు. కొన్ని సెక్షన్లలో ఉద్యోగులు తనిఖీ చేస్తున్న సమయంలో అదే సమయానికి రావడంతో ఆమె మండి పడ్డారు. ఉద్యోగులు సమయపాలన పాటించకుండా క్రమశిక్షణ రహితంగా వ్యవహరించడం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగులు క్రమశిక్షణతో వ్యవహరించాలని, సమయపాలన పాటించని వారిని ఉపేక్షించబోమని ఆమె స్పష్టం చేశారు. ఆలస్యానికి ఎలాంటి సాకులు చెప్పరాదన్నారు. ఉదయం 10:30 గంటలకు విధులలో ఉండాలని స్పష్టం చేశారు. 10:35 గంటలకు అన్ని విభాగాల నుండి హాజరు రిజిస్టర్‌ను తన ఛాంబర్ కు పంపించాల్సిందిగా అన్ని విభాగాల అధికారులకు వెంటనే సర్కులర్ జారీ చేయాలని ఆదేశించారు.



# పంద్రాగస్టున భారీ స్థాయిలో అన్న క్యాంటీన్ల ప్రారంభం

**విశ్వంభర, అమరావతి :** ఈ నెల 15వ తేదీన అన్న క్యాంటీన్లను ఏపీ ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించనుంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆహారం సరఫరా చేపట్టనుంది. అల్పాహారం, లంచ్, డిన్నర్ హరేకృష్ణ ఫౌండేషన్ సరఫరా చేయనుంది. అన్న క్యాంటీన్లకు ఆహార సరఫరాకు పిలిచిన టెండర్లల్లో హరేకృష్ణ సంస్థ ఎల్-1గా నిలిచింది. తొలి విడతలో 100 అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ప్రారంభించనుంది. రెండో విడతలో 83, మూడో విడతలో 20 అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నారు.

# వినేశ్.. నువ్వే మా ఛాంపియన్!

- నిరాశచెందొద్దు.. నీకు అండగా ఉంటాం
- ప్రకటించిన పలు రంగాల ప్రముఖులు

**పారిస్:** ఒలింపిక్స్‌లో భారత పతాకను రెపరెపలాడిస్తుందనుకున్న రెజ్లర్ వినేశ్‌ఫొగట్ పై ఆఖరి క్షణంలో అనూహ్యంగా అనర్హత వేటు పడటంతో భారతీయులు నివ్వెరపోయారు. అయితే యావత్ దేశం వినేశ్‌కు అండగా నిలచింది. నువ్వే మా ఛాంపియన్...నీ స్ఫూర్తి గొప్పది...తిరిగి విజయ శిఖరాలు అధిరోహించే శక్తి నీకుంది. నీకు మేమంతా అండగా ఉన్నాం అని ప్రధాని మోదీ మొదలుకొని ప్రతి ఒక్కరు సామాజిక మాధ్యమాలలో ప్రకటిస్తున్నారు. రాజకీయ, సినిమా, పారిశ్రామిక, క్రీడారంగాలకు చెందిన ఎందరో ఆమెకు ఓదార్పు వచనాలు పలికారు. కాగా అనర్హత వేటు పడిన వినేశ్‌ఫొగట్ అస్వస్థతకు గురయ్యారు. డీగ్రెడ్రేషన్ కారణంగా ఆమె పారిస్ లోని ఓ ఆస్పత్రిలో చేరి ప్రస్తుతం చికిత్స పొందుతున్నట్లు సమాచారం. సాధారణంగా ఆటగాళ్లు రెండు రోజులు ముందు నుంచే తమ బరువును నిర్ణీత కేటగిరి పరిధిలోనే ఉంచుకోవాల్సి ఉంటుంది. అయితే మంగళవారం బౌట్ సమయంలో ఆమె తన బరువు నియంత్రణలోనే ఉంచుకొన్నట్లు తెలుస్తోంది. కానీ, మంగళవారం రాత్రికి వినేశ్ 2 కిలోల అధిక బరువు ఉంది. దీంతో జాగింగ్, సైక్లింగ్, స్కిప్పింగ్ వంటివి బరువు తగ్గేందుకు దోహదపడే ఎక్సర్‌సైజ్‌లు చేసింది. అంతేకాకుండా భోజనం కూడా తీసుకోకుండా,



బరువును తగ్గించుకునేందుకు రాత్రంతా ఆమె నిద్రపోకుండా మేల్కొనే ఉన్నట్లు సమాచారం. దీని కారణంగానే వినేశ్ ఇప్పుడు డీహైడ్రేషన్‌కు గురైనట్లు క్రీడా వర్గాల మాట. ఆమెకు ఒలింపిక్ గ్రామంలోని ఓ పాలిక్లినిక్‌లో చికిత్స అందుకుంటున్నట్లు సమాచారం. ప్రస్తుతానికి ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

## సవాల్ చేసేందుకు ఐఓఏ సిద్ధం

అయితే వినేశ్ ఫొగాట్ విషయంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ఐఓఏ వారిపై సవాల్ చేసేందుకు సిద్ధమైంది. ఒలింపిక్ అసోసియేషన్ నిబంధనల మేరకు, పోటీ జరిగే రోజున బరువుతోపాటు వైద్య పరీక్షలు నిర్వహించడం కామనే. అయితే, మంగళవారం రాత్రి సెమీస్ పోరులో తలపడినప్పుడు లేని ఫొగాట్ బరువు బుధవారం ఉదయానికల్లా పెరగడంపైనా కూడా ఐవోఏ అనుమానాలను వ్యక్తం చేస్తోంది. ఒకవేళ నిర్ణయంపై ఒలింపిక్ కమిటీ పునఃసమీక్ష లేకుంటే మాత్రం ఫొగాట్‌పై అనర్హత వేటు కొనసాగుతుంది. అప్పుడు అమె స్వదేశానికి తిరిగిరాకతప్పదని క్రీడా వర్గాల మాట. "రెజ్లింగ్ 50 కేజీల విభాగం నుంచి వినేశ్ ఫొగాట్ అనర్హత వేటును ఎదుర్కోవాల్సి వచ్చింది. కేవలం కొన్ని గ్రాముల బరువు పెరగడం వల్ల ఆమెపై ఈ వేటు పడింది. దయచేసి వినేశ్ ప్రైవసీకి భంగం కలగించకుండా ప్రవర్తించాలని మేము విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ వార్తను పంచుకోవడం అత్యంత బాధాకరంగా ఉంది" అంటూ భారత ఒలింపిక్ సంఘం తాజాగా ఓ ప్రకటనలో పేర్కొంది.

## '100గ్రాములు బరువు ఎక్కువున్నా అనుమతిస్తారు కదా?'

పసిడి పోరుకు అర్హత సాధించిన వినేశ్ ఫొగాట్‌పై అనూహ్యంగా అనర్హత వేటు పడటం అందర్నీ షాక్‌కు గురి చేస్తోంది. వంద గ్రాముల అధిక బరువు ఉండడం వల్ల ఒలింపిక్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుందని చెప్పడం విమర్శలకు దారీ తీసింది. ఈ క్రమంలోనే వినేశ్ ఫోగాట్ పెద్ద నాన్న మహవీర్ స్పందించారు. 'గోల్డ్ మెడల్ కోసం దేశమంతా ఎంతో ఎదురు చూసింది. సాధారణంగా రెజ్లర్ ఓ 50-100 గ్రాముల బరువు ఎక్కువగా ఉన్నప్పటికీ ఆడటానికి అనుమతిస్తారు. అయితే, అక్కడ రూల్స్ మాత్రం మరోలా ఉండటం వల్ల అనర్హత వేటు పడింది. దేశ ప్రజలెవరూ నిరాశ చెందొద్దు. ఆమె ఏదో ఒక రోజు కచ్చితంగా దేశం కోసం మెడల్‌ను తెచ్చి పెడుతుంది. ఆమెను నెక్ట్స్ ఒలింపిక్స్ కోసం సన్నద్ధం చేస్తాను' అని అన్నారు. ఇక ఆమె అనర్హత వేటుపై ఇప్పటికే ప్రధాని మోదీ సహా పలువురు క్రీడా ప్రముఖులు స్పందించారు. ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు.

## 'ఫొగాట్ అనర్హత క్రూరమైన చర్య - అథ్లెట్లకు ఆ మాత్రం తెలుసు

ఒలింపిక్స్‌లో అనర్హత వేటు పడిన భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు పలువురు అండగా నిలుస్తున్నారు. ఇదే విషయంపై భారత బాక్సర్ విజేందర్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. దీన్ని విధ్వంసకర చర్యగా అభివర్ణించాడు. వినేశ్ వంటి ఎలైట్ అథ్లెట్లకు ప్రధాన పోటీలకు ముందు బరువు ఎలా తగ్గాలో తెలుసని పేర్కొన్నాడు. 'ఒకవేళ అథ్లెట్ కాస్త అధిక బరువు ఉంటే స్టీమ్ బాత్, రన్నింగ్, డైట్ వల్ల దానిని తగ్గించవచ్చు. కానీ, ఫైనల్‌కు ముందు కేవలం 100 గ్రాముల బరువు ఉన్నట్లు చెబుతూ అనర్హత వేటు వేయడం సరైన చర్య కాదు. బరువు తగ్గించుకోవడానికి బాక్సర్లకు సమయం ఇస్తారు. అథ్లెట్లు రాత్రిపూట 5- 6 కిలోల బరువు తగ్గించగలరు. ఇందులో ఎటువంటి సందేహం లేదు. ఆకలి, దాహాన్ని ఎలా నియంత్రించాలో అథ్లెట్లకు బాగా తెలుసు' అని విజేందర్ వ్యాఖ్యానించాడు.

## గోల్డ్ మెడల్ ఎవరికంటే?

ఈ పోటీల్లో వినేశ్‌పై అనర్హత వేటు పడినందున ఆమెకు ఎటువంటి పతకం ఇవ్వరని సమాచారం. అయితే ఆమెతో పాటు ఫైనల్‌లో ఉ



న్న అమెరికా క్రీడాకారిణి సారా హిల్డెబ్రాండ్‌కు మాత్రం ఆఖరి పోరులో పాల్గొనకుండానే బంగారు పతకాన్ని అందజేస్తారు. సిల్వర్ మెడల్‌ను మాత్రం ఎవరికీ కేటాయించకుండా అలాగే వదిలేస్తారు. ఇక కాంస్య పతక పోటీలు లాంఛనంగా జరుగుతాయని అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం ప్రకటించింది.

## క్వార్టర్ ఫైనల్లో అదరగొట్టిన వినేశ్

50 కిలోల విభాగంలో తొలి రౌండ్‌లో ఫోగట్ ప్రత్యర్థి జపాన్ టాప్ రెజ్లర్ సుసాకి అని డ్రా ఖరారు కావడంతో అందరూ ఆశలు వదిలేసుకొన్నారు. ఎందుకంటే అంతర్జాతీయ కెరీర్‌లో ఆడిన 82 మ్యాచ్‌లో సుసాకి ఒక్క బౌట్ కూడా ఓడలేదు. పైగా టోక్యోలో గోల్డ్‌తోపాటు నాలుగుసార్లు వరల్డ్ ఛాంపియన్ కావడంతో ఫోగట్ పని ఇక అంతే అని పెదవి విరిచారు. బలమైన ప్రత్యర్థిని వ్యూహాత్మకంగా ఎలా దెబ్బకొట్టాలో ముందుగానే సిద్ధమైన వినేశ్.. మ్యాట్‌పై దాన్ని ఆచరణలో పెట్టి అద్భుతం చేసింది. మంగళవారం జరిగిన రౌండ్- 16లో ఫొగట్ 3-2 సుసాకిపై చిరస్మరణీయ విజయంతో క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. బౌట్‌లో 90 సెకన్లు ఇద్దరు రెజ్లర్లు ఒకరిని ఒకరు అంచనా వేసుకోవడానికే కేటాయించారు. వినేష్ రక్షణాత్మకంగా వ్యహరించడంతో తొలి పాయింట్ కోల్పోయింది. ఆ తర్వాత ఫోగట్, సుసాకి అదను కోసం వేచి చూసే ధోరణినే అవలంబించారు. మరో పాయింట్ కోల్పోయిన ఫోగట్ 0-2తో వెనుకబడింది. పటిష్టమైన డిఫెన్స్‌తో సుసాకి పాయింట్లు ఇవ్వకుండా ఎంతో వ్యూహాత్మకంగా వ్యవహరించింది. పోటీ ముగియడానికి మరో 15 సెకన్ల సమయం ఉందనగా.. అప్పటి వరకు దూరదూరంగా ఉంటూ ప్రత్యర్థిని మభ్యపెట్టిన వినేశ్.. ఒక్కసారిగా సుసాకిపై ఎదురుదాడి చేసింది. పట్టు కోల్పోయిన జపాన్ రెజ్లర్‌ను మ్యాట్‌పై పడేసి రెండు పాయింట్లు స్కోరు చేసింది. హఠాత్ పరిణామంతో సుసాకి నివ్వెరపోయి చూస్తుండగా.. ఫొగట్ సంబరాల్లో మునిగింది. జపాన్ రెజ్లర్ చాలెంజ్ చేసినా.. ఆమెకు నిరాశే ఎదురైంది. ఇక, క్వార్టర్స్‌లో ఓక్సానాపై వినేశ్ 7-5తో గెలిచింది. తొలుత ఫొగట్ 4-0తో ఆధిక్యం సాధించింది. కానీ, పోరాడిన ఓక్సానా.. వినేశ్‌ను తన పట్టులో బిగిస్తూ 4 పాయింట్లు స్కోరు చేసింది. చివరి 48 సెకన్లలో ఓక్సానాను టేక్‌డౌన్ చేసిన ఫొగట్ బౌట్‌ను ముగించింది.

## సెమీ ఫైనల్లో కూడా..

వరుసగా రెండు బౌట్‌లు నెగ్గి ఆత్మవిశ్వాసంతో ఉన్న ఫొగట్.. సెమీ-స్‌లోనూ అదే జోరు చూపింది. ఏకపక్షంగా సాగిన పోరులో వినేష్ 5-0తో యుస్నేలిస్ గుజ్‌మన్ లోపెజ్ (క్యూబా)ను చిత్తు చేసింది. ఇద్దరు ఆరంభంలో ఆచితూచి ఆడారు. లోపెజ్ రక్షణాత్మకంగా వ్యవహరించడంతో.. ఫొగట్‌కు తొలి టెక్నికల్ పాయింట్ లభించింది. తర్వాత మరింత దూకుడుగా వ్యవహరించిన వినేష్ 4 పాయింట్లతో బౌట్‌ను సొంతం చేసుకొంది. రియో, టోక్యో క్రీడల్లో క్వార్టర్స్‌లోనే వెనుదిరిగిన ఫొగట్ ఈసారి ఏకంగా ఫైనల్‌కు చేరుకుంది. ఈ రోజు రాత్రి ఫైనల్ జరగాల్సి ఉంది. గోల్డ్ మెడల్ కొడుతుందని క్రీడాభిమానులు ఆశగా ఎదురుచూశారు. కానీ కాస్త బరువు పెరిగిందని అనర్హత వేటు వేసి, భారత ఆశలపై ఒలింపిక్ నిర్వాహకులు నీళ్లు చల్లారు.

## ఆనంద్ మహీంద్రా దిగ్భ్రాంతి



క్రీడాంశాలను రెగ్యులర్‌గా ఫాలో అయ్యే ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా ఎక్స్ ద్వారా తన స్పందన తెలియజేశారు. నోనోనో.. ఇది పీడకల అయితే బాగుండు. ఇది నిజం కాకపోతే బాగుండు అంటూ ట్వీట్ చేశారు. ఆనంద్ మహీంద్రా మాత్రమే కాదు.. దేశవ్యాప్తంగా ఎంతో మంది ప్రముఖులు వినేశ్‌కు మద్దతుగా నిలిచారు. ఆమె ధైర్యం కోల్పోకూడదని ఆకాంక్షించారు. ఈ క్లిష్ట సమయంలో ఆమెకు మద్దతుగా నిలవాలని అన్ని రాజకీయ పక్షాల నేతలూ వ్యాఖ్యలు చేశారు. కేవలం 100 గ్రాములు ఎక్కువ ఉందని ఆమెపై అనర్హత వేటు వేయడం దారుణమని ఆప్ ఎంపీ అన్నారు.

## 'వినేశ్‌కు అండగా ఉన్నాం

### కేంద్ర క్రీడా మంత్రి మన్‌సుఖ్ మాండవీయ



వినేశ్ ఫొగాట్‌కు కోచ్, సహాయ సిబ్బందిని నియమించామని కేంద్ర క్రీడా మంత్రి మన్ సుఖ్ మాండవీయ లోక్ సభలో వెల్లడించారు. ఆమెకు ఫిజియోథెరపిస్ట్ కూడా ఉన్నారని గుర్తు చేశారు. వినేశ్ గతంలో అనేక విజయాలు సాధించిందని కొనియాడారు. వినేశ్ ఫొగాట్‌కు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలిచిందని, ఆమెకు అత్యుత్తమ శిక్షణ తీసుకునేలా సాయపడ్డామని వివరించారు. ఫొగాట్ అనర్హతపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ ఐఓఏ అధ్యక్షు రాలు పీటీ ఉషను ఆదేశించారని పేర్కొన్నారు. ఫొగాట్ పై అనర్హత వేటుపై జీరో అవర్‌లో ప్రభుత్వం ప్రకటన చేయాలని విపక్షాలు పార్లమెంట్‌లో డిమాండ్ చేశాయి. ఈ విషయంపై క్రీడా మంత్రి సమాధానం చెప్పాలని నినాదాలు చేశాయి. ఈ మేరకు మన్‌సుఖ్ మాండవీయ వినేశ్ ఫొగాట్ అనర్హత అంశంపై ప్రకటన చేశారు.



**వినేశ్ ఇంటికి వెళ్లిన పంజాబ్ సీఎం**

అనర్హత వేటు పడిన రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఇంటికి పంజాబ్ సీఎం భగవంత్ మాన్ వెళ్లారు. ఫొగాట్ కుటుంబ సభ్యులను హరియణాలో కలిశారు. ఈ మేరకు వారితో మాట్లాడారు.

# ఐటీ శాఖ కీలక ప్రకటన

**విశ్వంభర, బిజినెస్ :** ఆదాయపు పన్ను రిటర్నులు ఈసారి రికార్డ్ స్థాయిలో నమోదయ్యాయి. 7 కోట్ల మందికిపైగా తమ రిటర్నులు ఫైల్ చేశారు. ఇప్పుడు వారంతా తమ ట్యాక్స్ రీఫండ్ కోసం వేచి చూస్తున్నారు. అయితే, ఇదే అదునుగా తీసుకుంటున్న సైబర్ నేరగాళ్లు రీఫండ్ పేరుతో అమాయకుల నుంచి డబ్బులు దోచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఐటీ రీఫండ్ల పేరిట ట్యాక్స్ పేయర్ల ఫోన్లకు మోసేజ్‌లు పంపిస్తూ కొత్త మోసాలకు పాల్పడుతున్నారు. ఆదాయపు పన్ను రిటర్నులు ఫైల్ చేసి రీఫండ్ల కోసం ఎదుచూస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని డబ్బులు దొచుకునేందుకు కుట్ర పన్నుతున్నారు. క్రమంలో కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు సీబీడీటీ కీలక ప్రకటన చేసింది. పన్ను చెల్లింపుదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ' ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం నుంచి అంటూ వచ్చే సందేశాలు, ఫోన్ కాల్స్ నమ్మవద్దు. ఫోన్లకు వచ్చే ఎలాంటి లింకులపైనా క్లిక్ చేయవద్దు. మీ రీఫండ్ గురించి తెలుసుకోవాలనుకుంటే అధికారిక ఎక్‌నాలెడ్జ్‌మెంట్ ద్వారానే తెలియపరుస్తాం. ఫోన్లకు మెసేజ్‌లు, కాల్స్ ద్వారా ఎలాంటి సమాచారం ఉండదు. పిన్ నంబర్లు, పాస్‌వర్డులు, క్రెడిట్ కార్డు వంటి సమాచారాన్ని ఇ-మెయిల్ లేదా మెసేజ్‌ల రూపంలో ఐటీ శాఖ అడగదు. ఇలాంటి మెసేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలి' అని ఆదాయపు పన్ను శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. మరోవైపు.. నోయిడా సైబర్ పోలీసులు సైతం హెచ్చరికలు జారీ చేశారు. ఐటీ శాఖ పేరుతో వచ్చే లింకులపై క్లిక్ చేసి మోసపోవద్దని సూచించారు. ఐటీ రీఫండ్ ఖాతాలోకి రావాలంటే వ్యక్తిగత వివరాలు అందించాలని ఐటీ శాఖ పేరుతో మెసేజ్‌లు, మెయిల్స్ వచ్చినా, కొంత రుసుము చెల్లించాలంటూ సూచించానా అలాంటి వాటిని నమ్మవద్దని ఆదాయపు పన్ను శాఖ సూచించిం ది. మీ ఐటీఆర్ రీఫండ్ స్టేటస్ గురించి తెలుసుకోవాలనుకుంటే అధికారిక ఇ-ఫైలింగ్ వెబ్‌సైట్ ద్వారా లేదా హెల్ప్ లైన్ నంబర్ ద్వారా తెలుసుకోవాలని కోరింది. అలాగే సైబర్ నేరగాళ్ల మోసానికి గురైనట్లు గుర్తిస్తే వెంటనే సైబర్ సెల్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని పేర్కొంది. కొందరు ఐటీ శాఖ అధికారులుగా నమ్మించి ఎమర్జెన్సీగా పేమెంట్లు చేయాలంటూ ఒత్తిడి చేస్తుంటారని,

# నయా పాలసీలను ప్రకటించిన ఎల్ఐసీ

**విశ్వంభర, బిజినెస్ :** భారతదేశంలో చాలా ఏళ్లుగా బీమా అంటే ఎల్ఐసీ (లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) గుర్తుకు వస్తుంది. ఎల్ఐసీలో పాలసీ ఉంటే జీవితానికి దీమా అనే రేంజ్ ప్రజలు అభిమానాన్ని పొందింది. అయితే మారుతున్న కాలంతో పాటు ఎల్ఐసీ కూడా ఎప్పటికప్పుడు వినియోగదారులకు మేలు చేసేలా వివిధ పాలసీలను ప్రకటిస్తుంది. ముఖ్యంగా ప్రైవేట్ బీమా సంస్థల పోటీని తట్టకునేలా కస్టమర్ల ఆదరణను పొందేలా ఎల్ఐసీ తాజాగా రెండు నయా పాలసీలను ప్రకటించింది. ముఖ్యంగా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను ఇచ్చేలా ఈ పాలసీలను రూపొందించింది. టర్మ్ ఇన్సూరెన్స్, లోన్ రీపేమెంట్‌లకు వ్యతిరేకంగా సేఫ్టీ నెట్‌ను అందించడానికి కొత్త బీమా ప్లాన్‌లను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఎల్ఐసీ, యువ టర్మ్ ఇన్సూరెన్స్, ఎల్ఐసీ యువ క్రెడిట్ లైఫ్ ఇన్సూరెన్స్ పేరుతో ఈ పాలసీలు ఆగస్టు 5 నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ అందుబాటులోకి వచ్చాయి. ఎల్ఐసీ యువ టర్మ్ ప్లాన్ కేవలం ఎల్ఐసీ ఏజెంట్ల ద్వారా ఆఫ్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. అలాగే ఎల్ఐసీ డిజి టర్మ్ ఆన్‌లైన్‌లో ఎల్ఐసీ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే అందుబాటులో ఉంటుంది. ముఖ్యంగా కొత్తగా ఉద్యోగంలో చేరిన యువకులను ఆకర్షించేలా ఈ రెండు పాలసీలను రూపొందించారని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా ప్రజలు వివిధ అవసరాల కోసం అందుబాటులో ఉన్న రుణ సౌకర్యాలను ఉపయోగిస్తున్నారు. బీమా చేసిన కుటుంబానికి రుణ చెల్లింపులకు వ్యతిరేకంగా భద్రతా వలయాన్ని అందించడానికి గృహ/విద్య/వాహనం వంటి రుణ బాధ్యతలను కవర్ చేయడానికి ఎల్ఐసీ టర్మ్ బీమా పథకాన్ని ప్రారంభించింది. యువ డిజి టర్మ్ అనేది నాన్-పార్, నాన్-లింక్డ్, లైఫ్, ఇండివిజువల్, ప్యూర్ రిస్క్ ప్లాన్. ఇది పాలసీ వ్యవధిలో బీమా చేసిన వ్యక్తి మరణించిన సందర్భంలో బీమా చేసిన కుటుంబానికి ఆర్థిక రక్షణను అందిస్తుంది. ఇది నాన్-పార్ ప్రొడక్ట్, దీని కింద మరణంపై చెల్లించే ప్రయోజనాలు హామీ ఇస్తాయి.

### ఎల్ఐసీ యువ టర్మ్ ప్లాన్

ఈ పాలసీ తీసుకోవడానికి కనీస వయస్సు 18 సంవత్సరాలుగా ఉంటే గరిష్ట వయస్సు 45 సంవత్సరాలుగా ఉంది. మెచ్యూరిటీలో కనీస వయస్సు 33 సంవత్సరాలుగా ఉంటే గరిష్ట మెచ్యూరిటీ వయస్సు 75 సంవత్సరాలుగా ఉంది. ఈ పాలసీలో కనీస ప్రాథమిక హామీ మొత్తం రూ. 50,00,000, అలాగే గరిష్ట ప్రాథమిక హామీ మొత్తం రూ. 5,00,00,000. ఈ పాలసీలో ఆకర్షణీయమైన హై సమ్ అష్యూర్డ్ రిబేట్ ప్రత్యేక ప్రయోజనంగా ఉంటుంది. అలాగే ఈ పాలసీను మహిళలు తీసుకుంటే తక్కువ ప్రీమియం వసూలు చేస్తారు. అలాగే రెగ్యులర్ ప్రీమియం, పరిమిత ప్రీమియం చెల్లింపు కింద లైఫ్ అష్యూర్డ్ మరణంపై చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియమ్‌కు 7 రెట్లు లేదా మరణించిన తేదీ వరకు చెల్లించిన మొత్తం ప్రీమియంలలో 105 శాతాన్ని చెల్లిస్తారు.

### ఎల్ఐసీ యువ డిజీ టర్మ్ ప్లాన్

ఎల్ఐసీ యువ క్రెడిట్ లైఫ్/ డిజీ క్రెడిట్ లైఫ్ నాన్-పార్, నాన్ లింక్డ్, లైఫ్, ఇండివిజువల్, ప్యూర్ రిస్క్ ప్లాన్ అని నిపుణులు చెబుతున్నారు. ఈ పాలసీను తీసుకోవడానికి కనీస వయస్సు 18 సంవత్సరాలుగా ఉంటే గరిష్ట వయస్సు 45 సంవత్సరాలుగా ఉంది. ఈ పాలసీలో కనీస ప్రాథమిక హామీ మొత్తం రూ. 50,00,000, గరిష్ట ప్రాథమిక హామీ మొత్తం రూ. 5,00,00,000. ఈ పాలసీలో కూడా మహిళల నుంచి తక్కువ ప్రీమియం వసూలు చేస్తారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి ఈ

# మనసుగల మారాజు



**విశ్వంభర, సినిమా :**

ఆయన పేరులోనే కాదు మనసులోను రాజే.. ప్రజల సంరక్షణ కోసం రాజు నిరంతరం తపిస్తాడు, వారికి ఆపద వస్తే ప్రజల ముందు అన్నీ తానై నిలబడతాడు రాజు. అలానే మారాజు నటనలోనే కాదు ప్రజలకు ఎటువంటి విపత్తు ఎదురైనా తానున్నానంటూ అదుకుంటూ మారాజే.. అని పించుకుంటున్నారు రెబల్ స్టార్ ప్రభాస్ రాజు.

కేరళ రాష్ట్రం వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటన యావత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తుంది. ఈ విలయంలో దాదాపు 400 మంది ప్రాణాలు కోల్పోయారు. వందల సంఖ్యలో ప్రజలు గాయాలపాలయ్యారు. ఈ నేపథ్యంలో విపత్తులో నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు పలువురు ముందుకొస్తున్నారు. ఇప్పటికే సినీ తారలు, పలువురు రాజకీయ నేతలు తమ వంతు సాయం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే కుడి చేతితో సాయం చేస్తే ఎడమ చేతికి కూడా తెలీకూడదు అంటారు పెద్దలు. ఆపదలో ఉన్న ఎంతోమందికి ప్రభాస్ సాయం చేసి ఎప్పుడూ ఎక్కడా చెప్పుకోరు. సాయం పొందిన వారు చెప్పడం వల్లే ఆ విషయాలు బయటికొస్తాయి. తాజాగా మరోసారి ప్రభాస్ రాజు కేరళ వయనాడ్ ప్రమాదంలో సహాయకచర్యల కోసం తనవంతుగా భారీ విరాళాన్ని అందజేశారు. బాధితులకు పునరావాస, సహాయకచర్యల కోసం ఏకంగా రూ. 2 కోట్ల భారీ విరాళాన్ని ప్రకటించి.. వీడు ఎక్కడైనా రాజే అని పించుకున్నారు. ఈ సాయంపై అభిమానులు, నెటిజన్లు మాత్రమే కాకుండా.. ప్రభాస్‌ది చాలా గొప్ప మనసు అంటూ అందరూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక ఇప్పటికే పలువురు సినీ పెద్దలు వయనాడ్ కోసం విరాళం అందజేశారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్ వంశీ రూ. 5 లక్షలు, రష్మిక మందన రూ.10 లక్షలు, నయనతార డైరెక్టర్ విఘ్నేశ్ శివన్ దంపతులు రూ.20 లక్షలు, విక్రమ్ రూ.20 లక్షలు, అల్లు అర్జున్ 25 లక్షలు, ఫహాద్ ఫాజిల్ రూ.25 లక్షలు, కమల్ హాసన్ రూ.25 లక్షలు, మమ్ముట్టి, దుల్కర్- రూ.40 లక్షలు, సూర్య, జ్యోతిక దంపతులు రూ.50 లక్షలు, చిరంజీవి, రామ్ చరణ్ రూ.1 కోటి, ప్రభాస్ రూ. 2 కోట్లు విరాళం అందజేశారు. అలాగే మోహన్ లాల్ కూడా రూ.3 కోట్లు భారీ విరాళం అందజేసి గొప్ప మనసు చాటుకున్నారు. కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండ చరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య 400కి చేరిందని మీడియాలో కథనాలు వస్తున్నాయి. అడుగుల మేర మేట వేసిన బురద, శిథిలాల కింద మరింత మంది చిక్కుకుని ఉండొచ్చనే అనుమానంతో సహాయక బృందాలు తీవ్రంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయి. ఎన్డీఆర్, ఎస్డీఆర్ఎఫ్, కేరళ అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. బురద తొలగిస్తున్నకొద్దీ మృతదేహాలు బయటపడుతున్నాయని సహాయక సిబ్బంది చెబుతున్నారు. భయానకంగా మారిన ఈ ప్రాంతాల్లో సహాయ పునరావాస కార్యక్రమాల కోసం కేంద్రం సైన్యాన్ని రంగంలోకి దింపింది. మిలటరీ ఇంజనీర్లు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు కొన్ని చోట్ల తాత్కాలిక వంతెనలను నిర్మించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

## మళ్లీ ఓటీటీలోకి నయనతార
# అన్నపూరణి



**విశ్వంభర, సినిమా :** కోలీవుడ్ లేడీ సూపర్ స్టార్ నయనతార నటించిన వివాదాస్పద చిత్రం 'అన్నపూర్ణి' మళ్లీ ఓటీటీ వేదికపైకి రాబోతోంది. ఈ చిత్రం గతంలో కొన్ని వివాదాల కారణంగా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల నుంచి తొలగించబడిన విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రం ఆగస్టు 9 నుంచి 'సింపుల్ సౌత్' ఓటీటీలో ప్రసారం కానుంది. కానీ ఇక్కడే ఓ చిన్న ట్విస్ట్ పెట్టారు మేకర్స్. అదేంటంటే, ఈ చిత్రం భారతదేశంలో మాత్రం అందుబాటులో ఉండబోదని సమాచారం.'అన్నపూర్ణి' చిత్రంలో నయనతార టైటిల్ రోల్ పోషించింది. నయన్ యాక్ట్ చేసిన 75వ సినిమా ఇది. గతేడాది డిసెంబరు 1న థియేటర్లలో రిలీజైంది. అదే నెల చివర్లో నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చింది. అయితే ఇందులో ఓ బ్రహ్మణ అమ్మాయిని నాన్ వెజ్ వంటలు వండే చెఫ్‌గా చూపించడం పలువురి మనోభావాలు దెబ్బతీసింది. దీంతో ఈ సినిమాపై నానా రచ్చ జరగడంతో నెట్ ఫ్లిక్స్ ఈ చిత్రాన్ని ఓటీటీ ప్లాట్‌ఫామ్ నుంచి తొలగించింది. అటు నయనతార సైతం క్షమాపణలు చెప్పింది. ఇక ఇప్పుడు మళ్లీ ఈ చిత్రం దాదాపు ఏడు నెలల తర్వాత సింప్లీ సౌత్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుండటంతో మరోసారి వివాదాలు తలెత్తే అవకాశం ఉందని విశ్లేషకులు పలువురు భావిస్తున్నారు.

## బిత్తిరి సత్తిపైన
# కేసు నమోదు



**విశ్వంభర, సినిమా :** నటుడు, కమెడియన్ బిత్తిరి సత్తిపై కేసు నమోదైంది. భగవద్గీతను కించపర్చేలా వీడియో చేశాడని ఆయనపై హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. బిత్తిరి సత్తి భగవద్గీతను అనుసరిస్తూ వ్యంగ్యంగా చేసిన వ్యాఖ్యలపై హిందూ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. హిందూవుల మనోభావాలను దెబ్బ తీసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ప్రముఖ హిందూ సంఘం రాష్ట్రీయ వానసేన బిత్తిరి సత్తికి అల్టీమేటం జారీ చేశారు. ఈ వీడియోను సోషల్ మీడియాలో తొలగించి హిందూ సంఘాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భగవద్గీతపై వ్యంగ్యంగా వీడియో చేశాడని వానసేన ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# కష్టసుఖాల్లో నీతో మేము ఉన్నాం
## వినేశ్ ఫొగాట్‌కు అండగా సినీ తారలు



**విశ్వంభర, సినిమా :** పారిస్ ఒలింపిక్స్‌లో భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ పై అనర్హత వేటు పడిందని తెలియగానే కోట్లాదిమంది భారతీయుల మనసులు ముక్కలయ్యాయి. బుధవారం (ఆగస్టు 07) జరిగే ఫైనల్ పోరులో బంగారు పతకం సాధిస్తుందని ఎదురు చూసిన అభిమానులు ఈ న్యూస్ తెలియగానే షాక్ లోకి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నుంచి నెటిజన్ల వరకు వినేశ్ కు అందరూ అండగా నిలుస్తున్నారు. ఆమెకు ధైర్యం చెబుతూ సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. టాలీవుడ్, బాలీవుడ్ ప్రముఖులు కూడా వినేశ్ ఫొగాట్ కు సపోర్టుగా పోస్టులు షేర్ చేస్తున్నారు. భారత్ స్టార్ రెజ్లర్ పై అనర్హత వేటు పడడంపై సమంత తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ' కొన్ని సమయాల్లో, ఎంతగానో పోరాడే వ్యక్తులు కఠినమైన పరిస్థితులను ఎదుర్కొంటారు. మీరు ఒంటరిగా లేరని గుర్తుంచుకోండి. ఇన్ని కష్టాల మధ్య కూడా నిలదొక్కుకునే మీ అద్భుతమైన ధైర్యం నిజంగా ప్రశంసనీయం. మీ కష్టసుఖాల్లో మేము ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటాం' అని సమంత పోస్ట్ పెట్టింది. 'మా మనసులు ముక్కలయ్యే వార్త ఇది. కానీ వినేశ్.. నువ్వు ఇప్పటికే నీ ప్రతిభతో స్వర్ణ పతకాన్ని మించిన పేరు సాధించావ్' అంటూ తాప్సీ రాసుకొచ్చింది. ఇక సోనాక్షి సిన్హా స్పందిస్తూ.. ' ఇలాంటి కష్ట సమయంలో మిమ్మల్ని ఎలా ఓదార్చాలో కూడా నాకు తెలయదు. మీరు ప్రస్తుతం ఎంతటి బాధలో కూరుకుపోయారో అని ఊహించుకుంటేనే కష్టంగా ఉంది. కానీ మీరు ఎప్పటికీ ఛాంపియన్‌గా ఉంటారు అని మాత్రం నేను కచ్చితంగా చెప్పగలను' అని పోస్ట్ పెట్టింది. వీరితో పాటు ప్రకాశ్ రాజ్, ఫర్హాన్ అక్తర్, స్వర భాస్కర్, హేమ మాలినీ, విక్కీ కౌశల్, జోయా అక్తర్ తదితరులు వినేశ్ ఫొగాట్ అనర్హత విషయంలో తమ అభిప్రాయాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు.

# మరింత అందం కోసం పసుపు



**విశ్వంభర, ఫీచర్:** పసుపులో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. అనేక రకాల ఇన్ఫెక్షన్లను, ఇతర ఆరోగ్య సమస్యలకు ఇది దివ్య ఔషధంగా పనిచేస్తుంది. అందుకే డైలీ మనం చేసుకునే ఆహారాల్లో తప్పకుండా పసుపును వినియోగిస్తుంటాం. ఇది వంటలకు రంగు, రుచిని ఇవ్వడమే కాకుండా శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తుంది. అంతే కాదు ముఖ సౌందర్యాన్ని పెంచడంలో కూడా పసుపు కీలకపాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇందులోని ఔషధ గుణాలు చర్మ సంబంధిత సమస్యలను దూరం చేసి ముఖాన్ని మరింత మెరిసేలా చేస్తాయి.అయితే ఇందుకోసం మీరు చేయాల్సినంది రోజు పసుపు వాటర్ తాగడమే. ఇలా తాగడం వల్ల అనేక రకాల బ్యూటీ బెనిఫిట్స్ ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. మరి అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

**గ్లోయింగ్ స్కిన్**
పసుపులో ఉండే పోషకాలు శరీరంలోని టాక్సిన్లను తొలగించడంలో బాగా ఉపయోగపడతాయి. ముఖ్యంగా ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు కణాలు దెబ్బతినకుండా చర్మాన్ని కాంతివంతంగా చేస్తాయి అని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి మీరు డైలీ పసుపు నీరు తీసుకోవడం ద్వారా మంచి గ్లోయింగ్ స్కిన్ మీ సొంతం చేసుకోవచ్చు.

**మొటిమలు, మచ్చలను తగ్గిస్తుంది:**
పసుపులో ఉండే కర్కుమిన్ బ్యాక్టీరియాతో పోరాడటానికి, మొటిమలను తగ్గించడానికి చాలా సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇది మచ్చలను తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుందని అంటున్నారు.

**యవ్వనంగా కనిపించడానికి :**
డైలీ పసుపు వాటర్ తీసుకోవడం ద్వారా వృద్ధాప్య ప్రక్రియను అడ్డుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పసుపులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చిన్న వయస్సులో వృద్ధాప్యానికి కారణమయ్యే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి సహాయపడతాయి. ఇది ముఖంపై ముడతలు రాకుండా చేస్తుంది. అంతేకాకుండా నవయవ్వనంగా ఉంచేలా తోడ్పడుతుంది.

**డార్క్ సర్కిల్స్ తగ్గిస్తుంది:**
ప్రస్తుత రోజుల్లో చాలా మంది కళ్ళ కింద డార్క్ సర్కిల్స్ తో ఇబ్బంది పడుతున్నారు. అలాంటి వారు పసుపు కలిపిన నీరు లేదా పసుపు ఆధారిత క్రీములను వాడటం వల్ల ఈజీగా ఈ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. డార్క్ సర్కిల్స్ ఉన్న వారు రోజుకు రెండుసార్లు పసుపు ఆధారిత క్రీములు అప్లై చేసుకోవడం వల్ల నల్లటి వలయాలు తగ్గినట్లు పరిశోధకులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన పరిశోధనలో ఢిల్లీలోని డెర్మటాలజీ కాస్మెటిక్ సర్జరీ విభాగంలో పనిచేసే డాక్టర్లు పాల్గొన్నారు. పసుపులోని పోషకాలు కళ్ల కింద ఉన్న డార్క్ సర్కిల్స్ ను తగ్గించడంలో సహాయపడతాయని వారు పేర్కొన్నారు.

**గాయాలను నయం చేయడం:**
పసుపులోని కర్కుమిన్ అనే పదార్థం యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ యాక్సిడెంట్ లక్షణాలను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇవి చర్మంపై గాయాలను నయం చేయడంలో సహాయపడతాయి. అదనపు సెబమ్ ఉత్పత్తిని ఇది నియంత్రిస్తుంది. సాధారణంగా చర్మంపై సెబమ్ పెరగడం వల్ల చర్మంపై ఆయిల్ ఉత్పత్తి అయి జిడ్డుగా మారుతుంది. ఫలితంగా ముఖంపై మొటిమలు, మచ్చలు ఎక్కువవుతాయి. పసుపు వాటర్ తీసుకోవడం వల్ల సెబమ్ ఉత్పత్తి నియంత్రణలో ఉండి జుట్టుపై చర్మం ఏర్పడకుండా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇవే కాకుండా చర్మాన్ని హైడ్రేట్ గా ఉంచడంలో పసుపు వాటర్ చాలా ఉపయోగపడుతుంది. దీనిలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు తామర, సోరియాసిస్, వంటి చర్మ వ్యాధులు నివారించడంలో సహాయపడతాయి.

# బీర్ తాగితే వెయిట్ గెయిన్ అవుతారా? నిపుణుల మాటేంటి?



**విశ్వంభర, ఫీచర్ :** ప్రసుతం బీర్ తాగడం అనేది చాలా కామన్. చిన్నాపెద్దా తేడా లేకుండా ఆల్కహాల్ తెగ తాగుతుంటారు. అకేషన్ ఏదైనా సరే ఆల్కహాల్ ఉండాల్సిందే. వీకెండ్ వస్తే చాలు బ్యాచిలర్స్‌కి పండగే. అయితే బీర్ కార్బోహైడ్రేట్స్, ఆల్కహాల్‌తో పాటు ఫ్యాట్స్ శరీరంలో కేలరీల సంఖ్యను పెంచుతుంది. కాకపోతే బీర్ రకాన్ని బట్టి ఆల్కహాల్ కంటెంట్‌తో పాటు కేలరీల సంఖ్య కూడా మారుతూ ఉంటుంది. 355 మిల్లీ లీటర్ల బీరు తాగితే 150 కేలరీల శక్తి లభిస్తుంది. ఇదిలా ఉంటే బీర్ తాగడం వల్ల బరువు పెరుగుతారని చెబుతుంటారు. కానీ ఇది అవాస్తవం అని నిపుణులు అంటున్నారు. బీర్ తాగే వారు సాధారణంగా తినే ఆహారంలో, డైట్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉంటారు. దీని కారణంగానే బరువు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.అయితే ఎక్కువగా బీర్ తాగడం వల్ల మెటబాలిజంపై ప్రభావం పడుతుంది. వాటిలో ఉండే కేలరీలతో పాటు అదనంగా తీసుకునే ఆహారం.. శరీరంలో కొవ్వును పెంచుతుంది. ఇదంతా పొట్ట భాగంలో పేరుకుపోవడం వల్ల బరువు పెరిగినట్లు కనిపిస్తారు. ఈ సమస్య రాకుండా ఉండాలి అంటే హైడ్రేట్‌గా ఉండడం ఎంతైనా అవసరం. బీర్ తాగే అలవాటు ఉన్న వారు నీరు కూడా ఎక్కువగా తాగడం అలవాటు చేసుకోండి. అంతే కాకుండా క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. ఇదిలా ఉంటే సాధారణంగా బరువు పెరగడానికి అనేక కారణాలు ఉంటాయి. కానీ ఆల్కహాల్ తీసుకుని, బద్ధకం ఉండే వారిలో శారిరక శ్రమ తగ్గడం వల్ల బరువు కాస్త పెరుగుతుంది. ఫలితంగా మెటబాలిజం దెబ్బతిని క్రమంగా ఆరోగ్యం దెబ్బతింటుంది. అలా జరగకుండా ఉండాలి అంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అవసరం.

రిపోర్టర్స్ కావలెను V3 NEWS తెలుగు దినపత్రిక విశ్వంభర
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com